


# విభారే

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర్ రెడ్డి బుధవారం 11-05-2022 సంపుటి: 03 సంచిక: 234 పేజీలు: 4 వెల: రూ 3-00


# జలవనరుల శాఖపై సీఎం జగన్ సమీక్ష..



అమరావతి: జలవనరుల శాఖపై తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం సమీక్ష చేపట్టారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు ప్రగతిని సీఎం జగన్ సమీక్షించారు. ఈ సందర్భంగా.. అధికారులు వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను సీఎం జగన్‌కు నివేదించారు. పోలవరం దిగువ కాఫర్ డ్యాం పనులు జులై 31 నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఆ దిశగా పనులు సాగుతున్నాయని సీఎం జగన్‌కు వివరించారు అధికారులు. దిగువ కాఫర్ డ్యాంలో కోతకు గురైన ప్రాంతాన్ని ఇసుకతో నింపేందుకు అన్నిరకాల ప్రయత్నాలు మొదలయ్యాయి. దీనికోసం 76 శాతం జియో బ్యాగులతో ఇప్పటికే నింపామన్న అధికారులు. దెబ్బతిన్న డయాఫ్రం వాల్ నిర్మాణ డిజైన్లపై ఇన్వెస్టిగేషన్ పూర్తయ్యిందని, ఈనెలాఖరు నాటికి డిజైన్లపై స్పష్టత వస్తుందని తెలిపారు. పోలవరం నిర్మాణానికి సంబంధించి ఇంకా రీయంబర్స్ చేయాల్సిన డబ్బు రూ. 2,559.37 కోట్లు. వీలైనంత త్వరగా డబ్బును తెప్పించుకునే ప్రయత్నాలు చేయాలన్న సీఎం. పీపీఏ అనుమతి ఇచ్చిన తర్వాతనే ప్రతి పనీ జరుగుతుందని తెలిపారు. పనులు వేగంగా పూర్తిచేయాలన్న దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా తన డబ్బు ఖర్చు చేస్తోంది. చేసిన పనులకు సంబంధించి బిల్లులు వెంటనే రీయంబర్స్

## వలసల నివారణకు ఆ ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశం

జరిగేలా చూడాలని సీఎం జగన్ అధికారులతో చెప్పారు. అలాగే కేంద్ర ప్రభుత్వ అధికారులతో జరిగే సమావేశంలో రీయంబర్స్ అంశాన్ని ప్రస్తావించాలని అధికారులకు సీఎం జగన్ సూచించారు.నెల్లూరు, సంగం బ్యారేజీ పనుల పురోగతినిర్దేశించుకున్న లక్ష్యం మేరకు సకాలంలో ఈ రెండు ప్రాజెక్టులను పూర్తి చేస్తామని అధికారులు సీఎం జగన్‌కు తెలియజేశారు. అవుకు టన్నెల్ పనులపైనా సమీక్ష జరగగా.. పనులు చురుగ్గా సాగుతున్నాయని, ఆగస్టు నాటికి పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు. 2014?19 మధ్య గత ప్రభుత్వ హయాంలో టన్నెల్ ?1 కు సంబంధించి కేవలం 4.33 కిలోమీటర్లు మాత్రమే పనులు జరిగాయి. అంటే రోజుకు కేవలం 2.14 మీటర్ల పనిమాత్రమే గత ప్రభుత్వ హయాంలో సాగింది. 2019 ? 2022 వరకు కేవలం మూడేళ్ల కాలంలోనే ప్రస్తుత ప్రభుత్వ హయాంలో జరిగిన పని 2.8 కిలోమీటర్లు. అంటే రోజుకు 4.12 మీటర్ల మేరకు టన్నెల్ పనులు జరిగాయి. టన్నెల్ ?2 కు సంబంధించి 2014?2019 మధ్యలో రోజుకు 1.31 మీటర్ల పని జరగ్గా.. ఈ ప్రభుత్వ హయాంలో 2019?22 మధ్య కాలంలో రోజుకు 2.46 మీటర్లు పని జరిగింది. ప్రస్తుతం వెలిగొండలో నెలకు 500 మీటర్లపైన పని జరుగుతోంది. సెప్టెంబరులో టన్నెల్?1 ద్వారా నీటి విడుదలకు అధికారుల ధీమా. టన్నెల్?1 ద్వారా నీటిని పంపిస్తున్న సందర్భంలోనే టన్నెల్?2లోనూ కొనసాగనున్న పనులు. జూన్, 2023 నాటికి టన్నెల్ 2 పనులు పూర్తి. ఈలోగా పునరావాస కార్యక్రమాలను పూర్తిచేయాలని సీఎం జగన్.. అధికారులను ఆదేశించారు. ఉత్తరాంధ్రా సాగునీటి ప్రాజెక్టులపైనా సమీక్ష వంశధార నిర్వాసితుల కోసం అదనపు ఎక్స్ గ్రేషియా పైన సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు. దాదాపు రూ.226.71 కోట్ల రూపాయలను దీనికోసం వెచ్చిస్తోంది ప్రభుత్వం. నిర్వాసితులకు ఇచ్చిన హామీ మేరకు ఈ చెల్లింపులు చేస్తున్నామని సీఎం జగన్.. వెల్లడించారు. నిధులు మంజూరుచేస్తూ మార్చిలోనే దీనికి సంబంధించిన ఉత్తర్వులు జారీ అయ్యాయన్న అధికారులు. గొట్టా బ్యారేజీ వద్ద లిఫ్ట్ పెట్టి.. దానిద్వారా హీరమండలం రిజర్వాయర్ నింపే ప్రతిపాదనకు సీఎం జగన్ గ్రీన్ సిగ్నల్. దీనిపై పూర్తిస్థాయి కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం. నేరడి బ్యారేజీ నిర్మాణం అంశంపైనా కూడా దృష్టిపెట్టాలని ఆదేశాలు.

# మాజీ మంత్రి నారాయణ అరెస్ట్



విజయవాడ, మే 10, (న్యూస్ పల్స్)టీడీపీ మాజీ మంత్రి, నారాయణ విద్యాసంస్థల అధినేత నారాయణను ఏపీ సీఐడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ కొండాపూర్‌లోని ఆయన నివాసంలో పోలీసులు అరెస్ట్ చేశారు. నారాయణను ఆయన సొంత వాహనంలోనే పోలీసులు ఏపీకి తరలించారు. టెన్త్ ప్రశ్నపత్రం లీకేజీతో నారాయణ విద్యాసంస్థలకు సంబంధముందన్న ఏపీ పోలీసులు మాజీ మంత్రి నారాయణను అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల ఏపీ టెన్త్ పరీక్షల్లో ప్రశ్నపత్రం లీకేజీ ఘటనలు సంచలనం కలిగించాయి. సీఎం జగన్ కూడా నారాయణ, చైతన్య సంస్థలపై తీవ్ర ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే సుమారు 45 మంది

## టెన్త్ పేపర్ లీకేజీ ఆరోపణల్లో నారాయణ సంస్థల అధినేత

ప్రభుత్వ టీచర్లను పోలీసులు అరెస్ట్ చేశారు.మరో వైపు మాజీ మంత్రి నారాయణ కిడ్నాప్ గురయ్యారని హైదరాబాద్ రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు నమోదైంది. నారాయణ వ్యక్తిగత సహాయకులు ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రాయదుర్గం పోలీసులు అలర్ట్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో షాద్ నగర్ కొత్తూరు సమీపంలో ఏపీ పోలీసుల వాహనాలను పోలీసులు నిలిపివేశారు. తాము పదోతరగతి ప్రశ్నపత్రాల లీకేజ్ వ్యవహారంలో అదుపులోకి తీసుకున్నట్టు ఏపీ పోలీసులు చెప్పడంతో తెలంగాణ పోలీసులు వారి వాహనాలకు దారిచ్చారు. అనంతరం మాజీ మంత్రి నారాయణను ఏపీ పోలీసులు కొత్తూరు నుంచి చిత్తూరుకు తరలించారు.

పరీక్షలో నిర్వహణలో వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే-దేవినేని ఉమ

మాజీ మంత్రి నారాయణను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నాం. కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఈ అక్రమ అరెస్టుకు పాల్పడ్డారు. పరీక్షల నిర్వహణలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు అక్రమాలకు తెగబడింది. తప్పుడు కేసులకు, అక్రమ అరెస్టులకు టీడీపీ నేతలు భయపడరు. జగన్ ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి.

పేపర్ లీకేజీ జరగలేదని టీడీపీ నేతలు చెప్పగలరా?-బొత్స

టెన్త్ పేపర్ లీకేజీ కేసులో అన్ని జిల్లాల్లో పోలీసులు విచారణ చేపట్టారని మంత్రి బొత్స వెల్లడించారు. టీడీపీ నేతలు రాజకీయంగా మాట్లాడుతున్నారని.. పేపర్ లీకేజీ జరగలేదని టీడీపీ వాళ్లు చెప్పగలరా అని ప్రశ్నించారు. పేపర్ లీకేజీ కేసులో నారాయణ పాత్రపై పోలీసులు నిగ్గు తేలుస్తారని స్పష్టం చేశారు. ఈ కేసులో అరెస్ట్ అయిన వారిలో నారాయణ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ కూడా ఉన్నారన్నారు. అమరావతి ల్యాండ్ పూలింగ్ కేసులో అక్రమాలు జరగకపోతే ఎందుకు కేసు పెడతారని బొత్స నిలదీశారు.

ఇందులో రాజకీయ కుట్రేమీ లేదు- మాజీ మంత్రి బాలినేనిఇది కేవలం టెన్త్ క్లాస్‌కు సంబంధించిన అంశం. పేపర్ లీక్ కేసులో పోలీసులు విచారణ చేసిన తర్వాతే టీడీపీ నేత నారాయణను అరెస్ట్ చేశారు. ఆయనపై తగిన చర్యలు తీసుకుంటారు. ఇందులో రాజకీయ కుట్ర ఉందని టీడీపీ నేతలు ఆరోపించడంలో అర్థం లేదు.

ఆధారాలతోనే పోలీసులు అరెస్ట్ చేశారు-ఎమ్మెల్యే మల్లాది విష్ణు

నారాయణ విద్యా సంస్థల నుంచే టెన్త్ పేపర్ వాట్సాప్ అన్ని గ్రూపుల్లో పెట్టారని పోలీసుల దగ్గర ఆధారాలు ఉన్నాయి. ప్రాథమిక ఆధారాలతోనే పోలీసులు మాజీ మంత్రి నారాయణను అరెస్ట్ చేశారు. చంద్రబాబు, అచ్చెన్నాయుడు వాస్తవాలు తెలిసి కూడా ఇలా మాట్లాడుతున్నారంటే ఎలా అర్థం చేసుకోవాలి. అక్రమాలు జరిగాయనే తెలిసే ఇలా మాట్లాడుతున్నారు. ఇవి నారాయణ విద్యా సంస్థలు కాదు.. నారా విద్యా సంస్థలుగా

## నౌకాశ్రయంలో తలదాచుకున్న శ్రీలంక మాజీ ప్రధాని

కొలంబో: శ్రీలంక ప్రధాన మంత్రి మహింద రాజపక్స సోమవారం తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆర్థిక సంక్షోభంతో అట్టుడుకుతున్న ఆ దేశంలో ఆందోళనకారులు విజృంభించారు. త్రికోణమలైలో ఉన్న నావల్ బేస్‌లో ప్రస్తుతం మహింద రాజపక్స ఆశ్రయం పొందుతన్నట్లు తెలుస్తోంది. మహింద రాజపక్సతో పాటు ఆయన ఫ్యామిలీ కూడా అక్కడే తలదాచుకుంటున్నారు. రాజధాని కొలంబోకు సుమారు 270



కిలోమీటర్ల దూరంలో త్రికోణమలై నావల్ బేస్ ఉంది. అయితే ఆందోళనకారులు అక్కడ కూడా ప్రదర్శన చేపట్టారు. ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా ఫ్యామిలీతో కలిసి మాజీ ప్రధాని రాజపక్స నౌకాశ్రయానికి వెళ్లినట్లు భావిస్తున్నారు. ప్రభుత్వ మద్దతుదారులు, వ్యతిరేకుల మధ్య ఘర్షణలతో శ్రీలంక రణరంగంగా మారింది. అధ్యక్షుడు గొటబయ రాజపక్స, ప్రధాని మహింద రాజపక్స పదవుల నుంచి దిగిపోవాలంటూ నెల రోజులుగా నిరసనలు తెలుపుతున్న ప్రజలు సోమవారం ఉద్యమాన్ని మరింత తీవ్రం చేశారు. కొలంబోలో అధ్యక్ష కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించారు. ఈ నిరసనకారులపై ప్రభుత్వ మద్దతుదారులు దాడులకు తెగబడ్డారు. అనంతరం నిరసనకారులు ప్రభుత్వ మద్దతు దారులపై దాడులకు దిగారు. వారి వాహనాలకు నిప్పు పెట్టారు. ఎంపీలు, అధికార పార్టీ నేతల ఇండ్లను ముట్టడించారు. హింస కొలంబో నుంచి దేశమంతటికీ విస్తరించింది.

## బలమైన గాలికి బ్రిడ్జ్ కూలిందన్న ఆఫీసర్..

### ఖంగుతిన్న కేంద్ర మంత్రి గడ్కరీ

న్యూఢిల్లీ: బీహార్‌లోని సుల్తాన్‌గంజ్‌లోని గంగా నదిపై నిర్మిస్తున్న ఓ బ్రిడ్జ్ ఇటీవల కూలింది. అయితే దీనిపై స్థానిక ఐఏఎస్ అధికారి వివరణ ఇస్తూ.. బలమైన గాలులు వీయడం వల్ల బ్రిడ్జ్ కూలినట్లు రిపోర్ట్ ఇచ్చారు. ఆ రిపోర్ట్‌పై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. బలమైన గాలులు వీస్తే బ్రిడ్జ్ ఎలా కూలుతుందో అర్థం కావడం లేదని మంత్రి అన్నారు. ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ విషయాన్ని మంత్రి తెలిపారు.బీహార్‌లో ఏప్రిల్ 29వ తేదీన ఓ బ్రిడ్జ్ కూలిందని, దానిపై సెక్రటరీని వివరణ కోరగా ఆయన ఈ సమాధానం ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. ఓ ఐఏఎస్ ఆఫీసర్ ఎలా ఇంటివి నమ్ముతారో అర్థం కావడంలేదని ఆయన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. గట్టిగా గాలి వీస్తే బ్రిడ్జ్ కూలుతుందా, దీంట్లో ఏదో తప్పు జరిగి ఉంటుందని మంత్రి అనుమానం వ్యక్తం చేశారు. నాణ్యత లోపం లేకుండా తక్కువ ఖర్చుతో మన్నికైన నిర్మాణాలను చేపట్టాలని మంత్రి అన్నారు. 1710 కోట్ల ఖర్చుతో ఆ బ్రిడ్జ్‌ను నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. సుల్తాన్‌గంజ్, అగౌనీ ఘాట్ల మధ్య 2014లో బ్రిడ్జ్ నిర్మాణం ప్రారంభమైంది. బ్రిడ్జ్ పొడుగు 3116 మీటర్లు ఉంటుంది.




# బెంబేలెత్తిస్తున్న 'అసని' తుపాన్..

## అసలు ఆ పేరు ఎలా వచ్చిందంటే?

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫాన్‌గా మారింది. ఇది గంటకు 75 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉండడంతో పాటు మరింత బలంగా మారే సూచనలు ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది. దీనికి సైక్లోన్ అసని అని పేరు పెట్టారు. ఈ తుపానుకు శ్రీలంక పేరుని సూచించింది. సింహళ భాషలో దీని అర్థం 'కోపం'. హుద్‌హుద్.. తిత్లీ.. పెథాయ్.. పేర్లు వేరైనా ఇవన్నీ మన రాష్ట్రాన్ని అతలాకుతులం చేసిన తుపానులు. తాజాగా ఇప్పుడేమో అసని తుపాను.

తుపాన్లకి అసలు పేరు ఎందుకు?

వాతావరణ కేంద్రాల నుంచి వెలువడే సమాచారం ఎలాంటి గందరగోళం లేకుండా ప్రజలకు సవ్యంగా చేరేందుకే తుపానులకు పేర్లు పెట్టడం ఆనవాయితీ. కనీసం 61 కి.మీ. వేగం గాలులతో కూడిన తుపాను సంభవించినప్పుడే పేర్లు పెట్టడం సంప్రదాయంగా వస్తోంది. ఎందుకంటే ఒకే ప్రాంతంలో ఒకేసారి



ఒకటి కన్నా ఎక్కువ తుపానులు సంభవిస్తే వాటి మధ్య తేడా, ప్రభావాల్ని గుర్తించేందుకు ఈ పేర్లు ఉపయోగపడతాయి. ఆగ్నేయాసియాలో దేశాలే తుపానులకు పేర్లు పెడుతున్నాయి.

ఉదాహరణకు 'తిత్లీ' పేరును పాకిస్థాన్ సూచించింది. హిందూ మహా సముద్ర తీర ప్రాంతంలోని 8 దేశాలైన బంగ్లాదేశ్, ఇండియా, మాల్దీవులు, మయన్మార్, ఒమన్, పాకిస్థాన్, శ్రీలంక, థాయ్‌లాండ్ పేర్లలోని మొదటి ఆంగ్ల అక్షరాల జాబితా ఆధారంగా తుపాన్లకు పేర్లు పెట్టారు. 2018లో ఈ ప్యానెల్‌లో ఇరాన్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, యెమెన్ చేరాయి. దీంతో ఈ దేశాల సంఖ్య 13కు చేరుకుంది. ఉచ్చరించడానికి సులువుగా, ఎనిమిది అక్షరాల లోపే పేర్లు ఉండాలి. ఎవరి భావోద్వేగాలు, విశ్వాసాలను దెబ్బతీయకూడదు.

## తప్పు చేయలేదని నారాయణ నిరూపించుకోవాలి : ఏపీ మంత్రి బొత్స

ఏపీ మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత నారాయణ అరెస్ట్‌పై ఏపీ విద్యా మంత్రి బొత్స సత్యానారాయణ స్పందించారు. పదో తరగతి పేపర్ లీకేజీ వ్యవహారంలో దర్యాప్తు జరుగుతోందని బొత్స ప్రకటించారు. ఇప్పటి వరకు 60 మందిని అరెస్ట్ చేసినట్లు ఆయన వెల్లడించారు. ఇందులో భాగంగానే నారాయణ అరెస్ట్ అని స్పష్టం చేశారు. మాజీ మంత్రి నారాయణ అరెస్ట్ నేపథ్యంలో మంత్రి బొత్స ఏపీ సీఎం జగన్‌తో భేటీ అయ్యారు.ఈ భేటీ తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేపర్ల లీకేజీ వ్యవహారంలో నారాయణ పాత్రపై పోలీసులు తేలుస్తున్నారని బొత్స పేర్కొన్నారు. అయితే.. అన్ని జిల్లాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని, అరెస్టైన వారిలో ప్రభుత్వ, ప్రైవేట్ టీచర్లు కూడా ఉన్నారని వెల్లడించారు. అయితే? వీరిలో నారాయణ వైస్ ప్రిన్సిపాల్ కూడా ఉన్నారని వెల్లడించారు.ఇక నారాయణ అరెస్ట్‌పై టీడీపీ రాజకీయం చేస్తోందని మంత్రి బొత్స మండిపడ్డారు. పేపర్ లీకేజీ అసలు జరగలేదని టీడీపీ నేతలు చెప్పగలరా? అంటూ సూటిగా ప్రశ్నించారు. అమరావతి ల్యాండ్ పూలింగ్‌లో అసలు అక్రమాలే జరగకుంటే పోలీసులు ఎందుకు కేసులు పెడతారని ప్రశ్నించారు.తప్పు చేసిన వారెవర్నైనా ప్రభుత్వం అరెస్ట్ చేస్తుందని బొత్స స్పష్టం చేశారు. తప్పు చేస్తే మాత్రం ఎవర్నీ వదిలేది లేదని తేల్చి చెప్పారు. ఈ వ్యవహారంలో తాను తప్పు చేయలేదని నారాయణ నిరూపించుకోవాలని అన్నారు. ఇక? చట్టం తన పని తాను చేసుకుపోతుందని బొత్స పేర్కొన్నారు.



# శ్రీలంకలో చేయి దాటిపోతున్న పరిస్థితులు..

## మిలటరీకి ఎమర్జెన్సీ అధికారాలు

కొలంబో: శ్రీలంక దేశంలో తలెత్తిన ఆర్థిక సంక్షోభం కారణంగా ఆ దేశంలో పరిస్థితులు నానాటికీ తీసికట్టుగా మారుతున్నాయి. దేశ అధ్యక్ష భవనం ముందు నిరసనలు, ఉద్రిక్త పరిస్థితులతో శ్రీలంక అట్టుడుకుతోంది. ఆ దేశంలో ఎమర్జెన్సీ పరిస్థితులు తలెత్తాయి. తాజాగా.. శ్రీలంక ప్రధాన మంత్రి మహింద రాజపక్స రాజీనామా తర్వాత పరిస్థితులు మరింత అధ్వానంగా తయారయ్యాయి. రాజపక్స మద్దతుదారులకు, నిరసనకారులకు మధ్య జరుగుతున్న



ఘర్షణలతో కొలంబోలో సైన్యం రంగంలోకి దిగింది. తాజాగా.. మిలటరీకి, పోలీసులకు ఎమర్జెన్సీ అధికారాలను అప్పగిస్తూ శ్రీలంక నిర్ణయం తీసుకుంది. ఘర్షణల్లో ఏడుగురు మృతి చెందడంతో పరిస్థితి పూర్తిగా అదుపు తప్పేలా ఉందని భావించి శ్రీలంక ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.దేశాధ్యక్షుడు గొటబాయ రాజపక్స, ప్రధాని మహింద రాజపక్స రాజీనామా చేయాలంటూ గత నెల రోజులుగా శాంతియుత ఆందోళనలు నిర్వహిస్తున్న జనంపై సోమవారం రాజపక్స మద్దతుదారులు దాడికి పాల్పడటంతో పరిస్థితి ఒక్కసారిగా చేయిదాటిపోయింది. రాజపక్స బస్సుల్లో వందలాదిమంది మద్దతుదారులను రప్పించి, నిరసనకారులపై దాడి చేయించినట్టు స్థానిక మీడియా పేర్కొంది. దీంతో రెచ్చిపోయిన జనం మాజీ మంత్రులు, ఎంపీలు సహా అధికార పార్టీ నేతల ఇళ్లు, కార్యాలయాలు, వాహనాలను తగలబెట్టేస్తున్నారు.

## నారాయణ అరెస్ట్ కక్షపూరితమే : చంద్రబాబు నాయుడు

ఏపీ మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత నారాయణ అరెస్ట్‌పై టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు



నాయుడు స్పందించారు. ఈ అరెస్ట్ కక్షపూరితమని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో విఫలమైందని, అన్ని వర్గాల నుంచి విమర్శలు ఎదుర్కొంటోందని విమర్శించారు. ఈ వైఫల్యాలను కప్పిపుచ్చుకోడానికే నారాయణను అరెస్ట్ చేశారని ఆరోపించారు.నారాయణ అరెస్ట్‌ను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని చంద్రబాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్దేశపూర్వకంగానే దోషిగా చూపే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు.

# సంపాదకీయం

బుధవారం 11-05-2022

## మళ్లీ తెరపైకి హైదరాబాద్ యూటీ

కేంద్ర ప్రాంతంగా హైదరాబాద్ ప్రతిపాదన మళ్లీ తెరపైకి వస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. గతంలో అంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ సమయంలో ఈ ప్రతిపాదన బలంగా తెరపైకి వచ్చింది. అప్పట్లో ఈ ప్రతిపాదనకు ప్రస్తుత తెలంగాణ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖరరావు కూడా అంగీకారం తెలిపారు. అయితే తరువాత ఈ ప్రతిపాదన మరుగున పడింది. హైదరాబాద్ ను రెండు తెలుగు రాష్ట్రాల రాజధానిగా నిర్ణయించారు. పదేళ్ల పాటు రెండు తెలుగు రాష్ట్రాల రాజధానిగా హైదరాబాద్ ఉండాలని నిర్ణయించారు. రాష్ట్ర విభజన తరువాత పాలనా సౌలభ్యం కోసం, రాష్ట్రానికి సొంత రాజధాని నిర్మాణం లక్ష్యంతోనూ చంద్రబాబు అమరావతికి పాలనను షిఫ్ట్ చేశారు. పేరుకు హైదరాబాద్ రెండు తెలుగు రాష్ట్రాల రాజధాని అయినా.. ఆచరణలో మాత్రం హైదరాబాద్ తెలంగాణ రాజధానిగా, అమరావతి విభజిత ఆంధ్రప్రదేశ్ రాజధానిగా కొనసాగుతున్నాయి. గత ఎనిమిదేళ్లుగా ఇదే కొనసాగుతున్నప్పటికీ తాజాగా.. ఏపీ మంత్రులు రెండు రాష్ట్రాల రాజధాని హైదరాబాద్ అన్న అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించి, టీఆర్ఎస్ మంత్రి కేటీఆర్ ఏపీలో సౌకర్యాల లేమిపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. వాస్తవానికి రెండు తెలుగు రాష్ట్రాల రాజధానిగా హైదరాబాద్ హోదా 2024 జూన్ తో ముగుస్తుంది. ఆ సమయానికి ఆంధ్రప్రదేశ్ కు రాజధాని నిర్మాణం పూర్తయినా, కాకపోయినా ఆ రాష్ట్రం హైదరాబాద్ పై హక్కులు కోల్పోయినట్లే. ఇంత కాలం ఊరుకుని ఇప్పుడు కొత్తగా కనిపెట్టినట్లు ఏపీ మంత్రులు హైదరాబాద్ పై హక్కు గురించి మాట్లాడటం రాజకీయ ప్రయోజనం కోసం తప్ప మరొకందుకు కాదనడంలో సందేహం లేదు. హైదరాబాద్ పై హక్కు కోసం వైసీపీ ఇప్పుడు పాకులాడినా లాభం లేదు, రాజకీయ ప్రయోజనమూ సిద్ధించదు అది వేరే సంగతి. కానీ హైదరాబాద్ విషయంలో కేంద్రం ఆలోచన వేరుగా ఉందన్నది పరిశీలకుల విశ్లేషణ. టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడం.. సార్వత్రిక ఎన్నికలకు ముందు తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గందరగోళంలో పడేయటం లక్ష్యంగా కేంద్ర పాలిత ప్రాంతంగా హైదరాబాద్ అన్న అంశాన్ని మళ్లీ తెరపైకి తీసుకు వచ్చే అంశాన్ని తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే తెలంగాణకు అప్పుల విషయంలో అవరోధాలు సృష్టిస్తున్న కేంద్రం.. ఇప్పుడు రాజధాని విషయంలో కూడా మెలిక పెట్టే అవకాశాలున్నాయని పరిశీలకులు అంటున్నారు. హైదరాబాద్ కు నలువైపులా రక్షణ శాఖ భూములు ఉండటం, రక్షణ పరంగా హైదరాబాద్ సున్నితమైన ప్రాంతం కావడంతో ఈ ప్రతిపాదనకు వ్యతిరేకత పెద్దగా రాదనీ, ఒక వేళ వచ్చినా హస్తినను ఉదాహరణగా చూపి వ్యతిరేక గళాలను సముదాయించవచ్చన్నది కేంద్రం భావనగా వారు విశ్లేషిస్తున్నారు. ఇక ముఖ్యమంత్రి, టీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు.. గతంలో అంటే రాష్ట్ర విభజనకు ముందు.. ఏదో విధంగా రాష్ట్రం సాధించుకోవడమే లక్ష్యంగా హైదరాబాద్ కేంద్ర పాలిత ప్రాంతం అన్న ప్రతిపాదనకు తన అంగీకారం తెలిపారు. ఇప్పుడు కేంద్రం దానినే సాకుగా చూపి ఈ ప్రతిపాదనతో వేగంగా ముందుకు కదిలే అవకాశాలున్నాయంటున్నారు. ఈ పరిస్థితిని ఊహించే తెరాస సర్కార్ ప్రత్యామ్నాయ రాజధానిగా వరంగల్ ను ఎంచుకుని అక్కడ అన్ని సౌకర్యాలూ కల్పించేందుకు, అవసరమైన నిర్మాణాలకు పెద్ద ఎత్తున భూ సేకరణకు నడుంబిగించింది. ఇప్పటికే వరంగ్, ఆ చుట్టుపక్కల దాదాపు పాతిక వేల ఎకరాలను ప్రభుత్వం సమీకరించింది. ఈ సమీకరణ రాజధానిగా వరంగల్ ను అభివృద్ధి చేయాలన్న ప్రణాళికతో నేనని పరిశీలకులు చెబుతున్నారు. రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద నగరమైన వరంగల్ ( జిల్లాల విభజనకు పూర్వం) అభివృద్ధికి అన్ని విధాలుగా అనుకూలం. వరంగల్, హన్మకొండ, కాజీపేట కలిసి ఉన్న వరంగల్ కు రాజధాని నగరానికి ఉండాల్సిన అన్ని నగరాలూ ఉన్నాయి. అలాగే ఆదాయం విషయంలో కూడా తెలంగాణలో హైదరాబాద్ తరువాతి స్థానంలో వరంగల్ నిలుస్తుంది. ఇప్పికే రాష్ట్రానికి రెండో ఆర్థిక రాజధానిగా విలసిల్లుతున్న వరంగల్ ను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి వీలుగా మౌలిక సదుపాయాల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. కేంద్రం ఒక వేళ హదరాబాద్ ను యూనియన్ టెరిటరీగా ప్రకటిస్తే ఎలాంటి ఇబ్బందులూ లేకుండా వరంగల్ ను తెలంగాణకు రాజధానిగా రెడీమేడ్ సిద్ధం చేసే లక్ష్యంతో అక్కడ అభివృద్ధిపై టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని పరిశీలకులు అంటున్నారు.

## పులివెందులలో రంజుగా రాజకీయం

కడప, మే 10, (న్యూస్ పల్స్) వైఎస్ కుటుంబానికి పులివెందుల కంచుకోట. అక్కడి నుంచే అప్పట్లో రాజశేఖర్ రెడ్డి, ఇప్పుడు జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆ ప్రాంతంలో చీమ చిటుక్కుమన్నా వెంటనే వైఎస్ కుటుంబానికి తెలిసిపోతుంది. అందుకే తమకు ఎదురునిలిచే నాయకుడు లేడని వైఎస్ కుటుంబం ఇంత కాలం భావించేది. వైసీపీ నేతలు కూడా పులివెందుల తమ నాయకుడికి కంచుకోట అని చెబుతూ ఉంటారు. కానీ అలాంటి చోట వైఎస్ కుటుంబ పునాదులు మెల్ల మెల్లగా కదులుతున్నాయి. ప్రజల్లో మెల్ల మెల్లగా మార్పు మొదలుకావడంతో వైసీపీ నేతల ఆగడాలకు చెక్ పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా సీఎం జగన్ సమీప బంధువును పోలీసులు అరెస్ట్ చేయడంతో ఇది రూఢీ అయినట్లేనని పరిశీలకులు అంటున్నారు. పులివెందులలో ఏం చేసినా తమను అడిగే వారు లేరని వైఎస్ కుటుంబ సభ్యులు భావిస్తారు. అందుకే ఇంత కాలంగా వారి ఆగడాలకు అంతూ పొంతు లేకుండా పోయింది. మరీ ముఖ్యంగా జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ కుటుంబం నుంచి వ్యాపారులకు, కాంట్రాక్టర్లకు వేధింపులు మరింత ఎక్కువ అయ్యాయన్నది స్థానికుల ఆరోపణ. ఇప్పుడు అలాంటి వ్యవహారంలోనే జగన్ సమీప బంధువు చక్రాయిపేట మండల వైసీపీ ఇంచార్జి కొండారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. పులివెందుల – రాయచోటి వెళ్లే రహదారి పనులు చేస్తున్న ఎస్ ఆర్ కే కన్ స్ట్రక్షన్స్ కాంట్రాక్టర్ ను కమిషన్ కోసం బెదిరించాడని కొండారెడ్డిపై కేసు నమోదు అయ్యింది. దానితో పోలీసులు కొండారెడ్డిని అరెస్టు చేశారు. ఏకంగా జగన్ కు సమీప బంధువునే పోలీసులు అరెస్ట్ చేయడంతో నియోజకవర్గంలో కొత్త చర్చ మొదలైంది. అధికార పార్టీ నేత, అందులోనూ జగన్ బంధువునే పోలీసులు కటకటాల్లోకి నెట్టడంతో వైసీపీ నేతలు కూడా పులివెందులలో వైఎస్ కుటుంబ హవాకు బ్రేక్ పడుతోందా అన్న అనుమానాలు ప్రారంభమయ్యాయి. నిజానికి జగన్ 2019 ఎన్నికల్లో గెలిచి సీఎం అయిన తర్వాత నుంచి జగన్ కు, ఆయన కుటుంబీకులకు పులివెందులపై పట్టు సడలడం ప్రారంబమైందనే చెప్పాలి. ముఖ్యంగా గత ఎన్నికలకు ముందు వైఎస్ వివేకానంద రెడ్డి హత్యతో దీనికి బీజం పడందని చెప్పవచ్చు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య, ఆ తరననంతర సంఘటనల్లో పులివెందుల ప్రజలలో వైఎస్ జగన్ పట్ల వ్యతిరేకత ప్రారంభమైందని స్థానికులు చెబుతున్నారు. సొంత బాబాయ్ మర్డర్ కేసు విషయంలోనూ జగన్ ఏ మాత్రం శ్రద్ధ చూపకపోవడం, పైపెచ్చు హత్య ఆరోపణలు ఎదుర్కొటున్న వారిని వెనకేసుకు రావడం, అలాగే సోదరి, తల్లి పట్ల సీఎం అయిన తరువాత జగన్ చూపుతున్న నరాదరణ పులివెందుల ప్రజలలో జగన్ తీరు పట్ల అయిష్టత పెరగడానికి కారణమయ్యాయంటున్నారు. మరోవైపు జగన్ సమీప బంధువులే ప్రజలు, కాంట్రాక్టర్లు, అధికారులను వేధిస్తున్నారనే అపవాదు కూడా ఉంది. ఆ కారణంగానే పులివెందులలో జగన్ పునాదులు కదులుతున్నాయని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

## వరుస భేటీలతో తాజా మాజీలు

నెల్లూరు, మే 10,మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రకంపనలు వైసీపీలో ఇంకా తగ్గలేదు. బహిరంగంగా నిరసనలు తెలిపి చల్లబడ్డ వారు చల్లబడగా.. బైటకు ఇసుమంతైనా అసంతృప్తి కనబరచని తాజా మంత్రులు కొందరు తమ మౌనంతో పార్టీ అధినేతను కలవరపెడుతున్నారు. ముఖ్యంగా పదవులలో ఉండగా బూతుల మంత్రులుగా ప్రత్యేక గుర్తింపు పొందిన కొడాలి నాని, విపక్షాలపై ప్రత్యేక శైలిలో విమర్శలతో చెలరేగిపోయే పేర్ని నాని వంటి వారి మౌనం ముందు ముందు ఏ పరిణామాలకు దారి తీస్తుందో అన్న కలవరం వైసీపీలో ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. ముఖ్యంగా జగన్ లో వారి మౌనం కారణంగా అంతర్మథనం మొదలైందని పరిశీలకులు అంటున్నారు. మూడేళ్ల నాడే అంటే మంత్రివర్గ ప్రమాణ స్వీకారం రోజునే రెండున్నరేళ్ల తరువాత కేబినెట్ లో మార్పులు ఉంటాయి అని చెప్పినా ఇప్పుడీ నిరసనలేమిటని ఆయన ఫీలౌతున్నారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అనగానే.. సీఎం ఏ బాధ్యతలు అప్పగిస్తే వాటిని సంతోషంగా, మనస్ఫూర్తిగా చేస్తామంటూ అందరి కంటే ముందుగా మీడియా ముందుకు వచ్చి మాట్లాడిన వారే ఇప్పుడు సైలంట్ అయిపోవడమేమిటని జగన్ ఫీలౌతున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కొడాలి నాని వంటి వారి మౌనం పార్టీలో మున్నెన్నడూ లేని స్తబ్దత కనిపిస్తున్నదని జగన్ భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు అంటున్నాయి. విపక్షంపై మరీ ముఖ్యంగా తెలుగుదేశం అధినేతపై బూతుల పంచాంగంతో విరుచుకుపడే కొడాలి నాని మౌనం.. పార్టీలో పెద్ద చర్చకు దారి తీసింది. సాధారణంగా జగన్ అప్పాయింట్ మెంట్ దొరకడమే కష్టం.. అలాంటిది ఆయనే స్వయంగా తాజా మాజీల మౌనంతో వారిని పిలిపించుకుని మరీ మాట్లాడుతున్నారనీ, వారికి యాక్టివ్ గా ఉంచేందుకు ప్రయత్నస్తున్నారనీ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా కొడాలి బూతుల పంచాంగం వల్లనే పార్టీలో యాక్టివిటీ ఉందని జగన్ భావిస్తున్నట్లుగా కనిపిస్తున్నది. ఆయన మౌనం వహించడంతో మొత్తంగా పార్టీలోనే ఏదో ఇబ్బంది ఉందన్న భావన స్వయంగా జగన్ లోనే వ్యక్తమౌతున్నదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీలో మళ్లీ పూర్వపు దూకుడు, జోరు కనిపించాలంటే తాజా మాజీలు మళ్లీ పూర్వంగా విమర్శల గళం విప్పాల్సిన అవసరం ఉందని జగన్ భావిస్తున్నారు. అందుకే గతంలోలా బుజ్జగింపులకు ప్రభుత్వ సలహాదారు సజ్జలపై ఆధారపడకుండా తానే రంగంలోకి దిగారని పరిశీలకులు అంటున్నారు. కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు మందు వరకూ మంత్రి పదవులు వస్తాయని కొందరు? మంత్రి పదవులు నిలబెట్టుకోవాలని కొందరు తెలుగుదేశం పార్టీపైనా.. ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుపైనా బూతుల పంచాంగం విప్పి మరీ విమర్శలు గుప్పించారు. మంత్రివర్గ విస్తరణ చేసే వరకూ అదే పరిస్థితి కొనసాగింది.

తీరా విస్తరణ పూర్తయిన తరువాత.. అదీ పార్టీలోనే 'ముందస్తు' యోచన జరుగుతున్న సమయంలో.. తాజా మాజీల గళం మూగబోవడంతో.. వైసీపీ డీలా పడిందన్న భావన జనంలో బలంగా కనిపిస్తున్నది. ఇదే జగన్ ను గాభరా పెడుతోంది. తాజా మాజీలతో స్వయంగా భేటీలు జరుపుతూ, గతంలోలా మాట్లాడాలనీ, అలా మాట్లాడితే పార్టీ మళ్లీ గెలిస్తే మంత్రి పదవులు ఇస్తాననీ హామీలు గుప్పిస్తున్నారని వైసీపీ వర్గాలే చెబుతున్నాయి. అయితే రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితిని అంచనా వేసిన తాజా మాజీలు విపక్షంపై బూతలతో విమర్శలు చేయడానికి జంకుతున్నారనీ, ఇప్పటికే నెగటివ్ ముద్ర పడిన తాము ఇంకా అలాగే ముందుకు సాగితే భవిష్యత్ లో చిక్కులు తప్పవనీ భావిస్తున్నరని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అవంతి వంటి తాజా మాజీలు ఇప్పటికే సొంత గూటికి ( తెలుగుదేశం) చేరేందుకు ప్రయత్నాలు ప్రారంభించారన్న వార్తలు వినవస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో జగన్ మాట విని తాజా మాజీలు గతంలోలా చంద్రబాబుపై దూషణల పర్వానికి తెరతీసు అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయన్నది పరిశీలకుల భావన.

## వెలుగొండకు వెలుగు ఎక్కడా...

### ముందుకు సాగని ప్రాజెక్టు పనులు

ఒంగోలు, మే 10, అంతకు ముందు కూడా మరోసారి ఇటువంటి హమీనే ఇచ్చారు. అనుకున్న స్థాయిలో పనులు పూర్తి కాకపోవడంతో ఈసారైనా హామీ నెరవేరుతుందా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. మూడోసారీ వాయిదా వేస్తే చంద్రబాబుకూ, మనకూ తేడా ఉండదనే చర్చ వైసిపిలో సాగుతోంది. ఇప్పటికే మార్కాపురం జిల్లా డిమాండ్‌ను ప్రభుత్వం పట్టించుకోలేదు. దీనిపై ఆ ప్రాంత రైతుల్లో వ్యతిరేకత వచ్చింది. ఇప్పుడు వెలుగొండ చర్చకు వస్తోంది. ఎన్నిసార్లు వాయిదా వేస్తారనే విమర్శలు వస్తున్నాయి. దీంతో, ప్రభుత్వం వెలుగొండను ఈ ఏడాది ఎలాగైనా ప్రారంభించేం దుకు ప్రయత్నాలు చేస్తోంది. కొత్తగా వచ్చిన కలెక్టర్ దినేష్‌కుమార్ ఈ ప్రాజెక్టును సందర్శించారు. ఈ ఏడాది ప్రారంభిస్తామని ప్రకటించారు.వెలుగొండకు 1996లో పునాది రాయి పడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కాలేదు. 2004లో అధికారంలోకి వచ్చాక అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి దీని పనులు ప్రారంభించారు. 2006 నుంచి 2008లోపు నిర్వాసితులను గుర్తించి సామాజిక, ఆర్థిక సర్వే పూర్తి చేశారు. ముంపు గ్రామాలు 11 ఉన్నాయి. ప్యాకేజీలు ఇవ్వలేదు. నిర్వాసితుల్లో చాలామంది చనిపోయారు. వారి పిల్లలు పెద్దవాళ్లయ్యారు. వీరికి పరిహారం కోసం పోరాటాలు సాగాయి. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ప్యాకేజీ ఇవ్వాలని నిర్ణయించారు. ప్రస్తుతం 7,555 మంది నిర్వాసితులు ఉన్నారు. ఒన్‌టైం సెటిల్‌మెంటు కింద రూ.12.50 లక్షలు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మొత్తం తీసుకున్న వారికి ఇంటి స్థలం, ఇంటి నిర్మాణ వ్యయం రాదు. నిర్వాసితులను వెంటనే గ్రామాల నుంచి తరలించడానికి ఈ ప్యాకేజీని తెరపైకి తెచ్చారు. 90 శాతం మంది అంగీకరించేలా చేశారు. వాస్తవానికి కాలనీలు ఏర్పాటు చేసి అక్కడ అన్ని సౌకర్యాలూ కల్పించాకే తరలించాలి. మళ్లీ జీవనం సాగేలా చూడాలి. ఇదే పునరావాసం అంటే. దీనికి భిన్నంగా వెలుగొండ నిర్వాసితులను తరలిస్తున్నారు. ప్యాకేజీ పేరుతో డబ్బులు ఇచ్చి పంపుతున్నారు. ఇక ఎక్కడుండాలో వాళ్ల ఇష్టం. ఇల్లు, వాకిళ్లు ఖాళీ చేసిపోవాలి. ఎక్కడో అద్దెలకు ఉండాలి. కొందరు స్థలాలు కోరుకుంటున్నారు. ఒక్క నిర్వాసిత కాలనీ కూడా ఏర్పాటు కాలేదు. రూ.12.50 లక్షలు తీసుకున్న వారికి ఇతర సౌకర్యాలేమీ లేవు. ఇదే భవిష్యత్తులో వారిని శాశ్వత నిర్వాసితులుగా మిగల్చనుంది. 7,555 మంది నిర్వాసితుల్లో ఇప్పటివరకూ 115 మందికే ప్యాకేజీ ఇచ్చారు. మిగతా వారికి ఇవ్వాలి. ఇందుకోసం రూ.1,400 కోట్లకుపైగా నిధులు అవసరం. రాష్ట్ర ప్రభుత్వం వెలుగొండకు ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.850 కోట్లు మాత్రమే కేటాయించింది. ఇతర పనులను పక్కనబెట్టినా నిర్వాసితులకు చెల్లింపులకు కూడా ఈ నిధులు చాలవు.

ప్రస్తుతం వీరంతా డ్యాములోనే ఉన్నారు. గ్రామాలు ఖాళీ చేయలేదు. ఆగస్టులో ఈ ప్రాజెక్టును ప్రారంభించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్న నేపథ్యంలో ప్యాకేజీలు ఇచ్చి పంపాలన్నా అవసరమైన మేరకు నిధులను మరో రెండు నెలల్లో ఇస్తేనే నిర్వాసితుల తరలింపు సాధ్యమవుతుంది.ప్రాజెక్టును 1996లో చేపట్టారు. తర్వాత ఎనిమిదేళ్లు వదిలేశారు. 2004లో పనులు ప్రారంభించారు. అప్పట్లో రూ.980 కోట్ల అంచనా వేశారు. పనులు సకాలంలో ఏ ప్రభుత్వం కూడా చేపట్టి పూర్తి చేయలేదు. చంద్రబాబు, రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి... ఇలా నలుగురు ముఖ్యమంత్రులు దీన్ని పూర్తి చేయలేకపోయారు. ఇప్పుడు సిఎం జగన్ హయాంలో పూర్తి చేస్తారా? లేదా? అన్నదే చర్చ. 2020 నాటికి దీని నిర్మాణ వ్యయం రూ.8,440 కోట్లకు చేరింది. ఇప్పటికే రూ.6 వేల కోట్లు వెచ్చించారు. నిర్మాణ పనులు 80 శాతం పూర్తయ్యాయి. రెండో సొరంగం, హెడ్ రెగ్యులేటర్ పనులు పూర్తి కావాల్సి ఉంది. అన్నిటికన్నా నిర్వాసితులకు ప్యాకేజీలు కీలకం. ఇవేవీ పూర్తి కాకుండానే దీన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## ఎవ్వరికి పట్టని ఆర్టీసీ

విజయవాడ, మే 10, ఎపిఎస్ఆర్టీసిని నిర్వీర్యం చేసే దిశగా రాష్ట్రప్రభుత్వం పావులు కదుపుతోంది. ఆర్టీసి బస్సులను, సిబ్బందిని క్రమక్రమంగా తగ్గిస్తూ ప్రైవేటీకరణ విధానాలను అమలు చేస్తోంది. అందులో భాగంగానే అద్దె బస్సులను పెంచుతూ రెగ్యులర్ నియామకాలకు మంగళం పాడుతోంది. గత పదేళ్ల నుంచి ఒక్క రెగ్యులర్ నియామకాన్ని కూడా సంస్థ చేపట్టలేదు. రాష్ట్ర విభజన జరిగే సమయంలో 12,800 బస్సులు, 64వేల మంది రెగ్యులర్ సిబ్బంది ఆర్టీసిలో ఉన్నారు. ప్రస్తుతం బస్సుల సంఖ్య 11,359, సిబ్బంది సంఖ్య 51వేలకు పడిపోయాయి. ఈ ఎనిమిదేళ్లల్లో సుమారు 1400 బస్సులు తగ్గగా అదే సమయంలో సుమారు 13వేల మంది సిబ్బంది పదవి విరమణ పొందారు. పదవి విరమణ పొందిన సిబ్బంది స్థానంలో గత పదేళ్లల్లో ఒక్క రెగ్యులర్ నియామకం కూడా జరపలేదు. 13వేల మంది సిబ్బంది స్థానంలో కేవలం 5వేల మందిని ఔట్‌సోర్సింగ్ విధానంలో ఆర్టీసి నియమించింది. దీంతో ఉన్న సిబ్బందిపైనే భారం పడుతోంది. దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో కండక్టర్లను తీసేసి టీమ్ మిషన్లతో డ్రైవర్లపై అదనపు భారం వేసింది. నిబంధనల ప్రకారం ప్రతి బస్సుకు 6 గురు సిబ్బంది పనిచేయాల్సి ఉండగా ప్రస్తుతం 4.6శాతం మందే చేస్తున్నారు. మరోవైపు అద్దె బస్సుల శాతాన్ని క్రమక్రమంగా పెంచుతోంది. ప్రస్తుతం అద్దె బస్సుల శాతం 20గా ఉంది. ఇటీవల 998 అద్దె బస్సులకు ఆర్టీసి టెండర్లు పిలిచింది. కొత్తగా తీసుకునే ఈ బస్సులతో కలుపుకుని అద్దె బస్సులు శాతం ఆర్టీసిలో 29శాతానికి పైగా పెరగనుంది. అద్దె బస్సులను కాకుండా సొంత బస్సులను తీసుకుంటే సుమారు 6వేల మంది సిబ్బంది సంస్థకు అదనంగా పెరిగే అవకాశం ఉండేది. రాష్ట్రప్రభుత్వం అద్దె బస్సులు పెంచుతూ, సిబ్బంది నియమకాలు చేయకపోతే ఆర్టీసి ప్రైవేటీకరణ అవుతుందని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు కారుణ్య.నియామకాలో కూడా అనేక షరతులను ఆర్టీసి విధిస్తోందని, దీనివల్ల కార్మికుల కుటుంబ సభ్యులు ఉద్యోగం పొందలేని పరిస్థితి ఏర్పడుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది

## టీడీపీ, జనసేన పొత్తు ఖరారు...?

విజయవాడ, మే 10,కలసి రావాలని చంద్రబాబు పిలుపు ఇస్తే.. తాము సిద్ధమని జనసేన సంకేతాలు ఇచ్చింది. దీంతో వీరి పొత్తులు ఖాయమని.. కలసి పోటీ చేయడం ఖాయమని తేలిపోయింది. అయితే చాలా మంది 2014 రిపీట్ అవుతుందా లేదా అన్న సందేహంలో ఉన్నారు. అంటే.. బీజేపీ కూడా వీరి కూటమిలో కలుస్తుందా లేదా అన్నది సందేహం. ప్రస్తుతం జనసేన బీజేపీతో పొత్తులో ఉంది. ఆ పొత్తు వల్ల ఒక్క ఓటు కలసి రాకపోగా ముస్లిం మైనార్టీ ఓట్లన్నీ దూరమైపోయాయని జనసేన నేతలు బహిరంగంగానే చెబుతూంటారు. దీంతో బీజేపీతో మాత్రమే పొత్తు కొనసాగించే అవకాశాలే లేవు. ఉంటే టీడీపీ, బీజేపీ లేకపోతే టీడీపీ అన్నట్లుగా జనసేన పరిస్థితి ఉంది. బీజేపీ నేతలు ఇప్పటికే అతి ప్రకటనలు చేస్తున్నారు. జనసేన పేరు కూడా పెద్దగా ప్రస్తావించకుండా తాము వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేస్తున్నామని ఎవరి పొత్తులు.. త్యాగాలు అవసరం లేదని సోము వీర్రాజు లాంటి నేతలు పెద్ద పెద్ద ప్రకటనలు చేస్తున్నారు. జనసేన ఒంటరిగా పోటీ చేయాలని.. ఓట్లు చీలిపోవాలని కోరుకుంటున్న వైసీపీ నేతల ప్రకటనలకు తగ్గట్లుగానే ఆయనవి ఉంటున్నారు. ఆయన ఏపీ బీజేపీ అధ్యక్షుడుకాబట్టి ఆయన మాటలకు విలువ ఉంటోంది. లేకపోతే ఎవరూ పట్టించుకోరు. కానీ పొత్తులను డిసైడ్ చేసేది కేంద్రంలోని నేతలే. ఎంపీలతో కేంద్రంలో సపోర్ట్ చేస్తామని ..ఏపీలో మాత్రం పొత్తులు సీట్ల సర్దుబాటు మాత్రం వద్దని వైసీపీ తరహాలో బీజేపీ కేంద్ర నాయకత్వాన్ని ఒప్పించేందుకు జనసేన ప్రయత్నించే అవకాశం ఉంటుందని అంటున్నారు. బీజేపీకి ఒక్క శాతం కూడా ఓటు బ్యాంక్ లేదు. ఆ పార్టీ వల్ల ఆయా పార్టీలకు కలసి వచ్చేదేమీ ఉండదు. కానీ కేంద్రంలో అధికారంలో ఉన్నపార్టీ కాబట్టి ఎన్నికల సమయంలో చాలా అంశాలు కలసి రావడానికి కొన్ని పనులు ఆటంకం లేకుండా చేయడానికి చాన్స్ ఉంటుంది. ఆ కారణాల వల్ల మాత్రమే బీజేపీని కన్సిడర్ చేస్తారు. బీజేపీని కలుపుకుంటారో లేదో కానీ జనసేన కూడా రాష్ట్ర భవిష్యత్ కోసం తాము కీలక నిర్ణయాలు తీసుకోక తప్పదని చెబుతున్నారు. విపక్షాలన్నీ కలసిపోయి .. ప్రభుత్వ వ్యతిరేకత పెరిగి.. ఆ ఓట్లన్నీ కేంద్రీకృతం అయితే.. వైసీపీకి ఘోరపరాజయం తప్పదని ఇప్పటికే రాజకీయ నిపుణులు తేల్చేశారు.

## మత్తులో తూగుతున్న విశాఖ



విశాఖపట్టణం, మే 10, మత్తుజగత్తులో జోగుతోన్న విశాఖతీరం తీరు మరోమారు కలకలం రేపుతోంది. టాస్క్‌ఫోర్స్ పోలీసుల వలలో చిక్కుకున్న వెస్ట్ బెంగాల్ డ్రగ్స్ ముఠా గుట్టురట్టు అయ్యింది. విశాఖ కేంద్రంగా సాగుతోన్న డ్రగ్స్ దందా ఏ స్థాయిలో ఉందో తెలుసుకుందాంవిశాఖలో మత్తు ఇంజక్షన్ల సరఫరా జోరుగా సాగుతోంది. మత్తు ఇంజక్షన్లను సరఫరా చేస్తోన్న ముఠా గుట్టు రట్టు చేశారు విశాఖ టాస్క్ ఫోర్స్ పోలీసులు. విశాఖలోని లీలా మహల్ ప్రాంతంలో నిర్వహించిన తనిఖీల్లో 3 వేల మత్తు ఇంజక్షన్ శాంపిల్స్‌ని సీజ్ చేశారు. ఈ మత్తుజగత్తు సూత్రధారులైన పశ్చిమబెంగాల్‌కి చెందిన అనుపమ్ అధికారి, కౌశిక్ ,చౌదరిలను పోలీసులు అరెస్టు చేశారు. పెంటాజోసైన్ లాక్టేట్ అనే మత్తు ఇంజక్షన్లను వెస్ట్ బెంగాల్ నుంచి విశాఖకి సరఫరా చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ డ్రగ్ ఇంజక్షన్లను వీరి నుంచి కొనుగోలు చేస్తోన్న ముఠా యథేచ్ఛగా విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. విశాఖలో పరిచయస్తుల ద్వారా ఈడ్రగ్స్‌ని విస్తృతంగా అమ్ముతున్న తీరు విశాఖలో కలకలం రేపుతోంది. 50 యాంపిల్స్ ఉన్న బాక్స్ ను 2వేలరూపాయలకు అమ్ముతూ డ్రగ్స్ దందా కొనసాగస్తున్నారు ఈ అగంతకులుమరోవైపు భీమిలి రెల్లి వీధిలోనూ టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. పద్మ రాఘవరావు అనే వ్యక్తి నుంచి 2 వందల మత్తు ఇంజక్షన్లు సీజ్ చేశారు. అనుపమ్ అధికారి నుంచి రాఘవరావు ఈ మత్తు ఇంజక్షన్లను కొనుగోలు చేసినట్టు నిర్ధారించారు పోలీసులు. 50 యాంపిల్స్ ఇంజక్షన్ల బాక్స్ ను 2వేలకు కొనుగోలు చేసి, వాటిని ఆరు వేలకు అమ్ముకుంటున్నట్టు పోలీసులు గుర్తించారు.సీపీ శ్రీకాంత్ ఆదేశాలతో మత్తు మాఫియాపై నిఘా పెంచింది టాస్క్‌ఫోర్స్. గత నెలలో సైతం మత్తు ఇంజక్షన్లను స్వాధీనం చేసుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు, ఆ కేసులో కూపీ లాగి మళ్ళీ కీలక నిందితులను అరెస్ట్ చేశారు.

## ఏపీలో పొత్తుల ఎత్తులు

విజయవాడ, మే 10,ఏపీలో రాజకీయం హాట్ హాట్ గా మారింది. ముఖ్యంగా అధికార వైసీపీ ఎమ్మెల్యేల్లో కొన్ని రోజులుగా టెన్షన్ మొదలైందనే ప్రచారం జరుగుతోంది. ఓ వైపు ప్రతిపక్ష టీడీపీ దూకుడుగా ప్రజల్లోకి వెళ్తోంది. చంద్రబాబు నాయుడు సభలకు కూడా జనం పోటెత్తి వస్తున్నారు. దీనికి తోడు ఇటీవల సీఎం జగన్ చేయించిన ఓ సర్వేలో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. చాలా మంది ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజల్లో అసంతృప్తి ఉందని ఓ మీటింగ్ లో కుండబద్దలు కొట్టారు. అంతే కాదు.. చాలా మంది ఎమ్మెల్యేలకు కనీసం పాస్ మార్కులు కూడా రాలేదట. జగన్ చేసిన వ్యాఖ్యలతో వైసీపీ నేతల్లో కొత్త చర్చ మొదలైంది. సర్వేలో తక్కువ శాతం వచ్చిన వారి లిస్టులో తమ పేరు ఉందా.? అని ఆరా తీయడం మొదలుపెట్టారట. ఎందుకైనా మంచిదని తమ అనుచరులతో క్షేత్ర స్థాయిలో తమ పరిస్థితి ఎలా ఉందనే లెక్కలు వేసుకుంటున్నారని సమాచారం. అందుకే చాలా మంది నేతలు సైలెంట్ గా తమ పని తాము చేసుకొని పోవాలని డిసైడ్ అయ్యారట. ఇప్పటికే కొంత మంది నేతలు ఎక్కడ తమకు టికెట్ రాదేమో అనే భయంతో ఆందోళన చెందుతున్నారని తెలుస్తోంది. ఇప్పటికే కొంత మంది నేతలు అధినేత జగన్ తీరుపై అసంతృప్తిగా ఉన్నారట.

## సమ్మర్ లో కానరాని ప్రాజెక్టుల పనులు

గుంటూరు, మే 10, సాగునీటి వ్యవస్థను మెరుగుపరచడంతోపాటు లక్షలాది ఎకరాల ఆయకట్టును స్థిరీకరించే ఉద్దేశ్యంతో చేపట్టిన డెల్టాల అధునీకరణ పనులు ముందుకు సాగడం లేదు. ఆయుకట్టు చివరి భూములకు నీటిని అందించడమే లక్ష్యంగా 2009లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆధునీకరణ పనులు చేపట్టారు. కృష్ణా, గోదావరి, పెన్నా డెల్టాల ఆధునికీకరణకు రూ.10 వేల కోట్లను కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో కృష్ణా, గోదావరి, పెన్నా డెల్టాలలో సుమారు 26 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించేందుకు పనులు ప్రారంభమయ్యాయి. వైఎస్ అనంతరం సిఎంలుగా ఉన్న కె రోశయ్య, ఎన్ కిరణ్‌కుమార్‌రెడ్డి ఈ పనులపై పెద్దగా ఆసక్తి కనబరచలేదు.. రాష్ట్ర విభజన తర్వాత టిడిపి అధికారంలోకి వచ్చినా, ఆ ప్రభుత్వం కూడా ఆధునికీకరణపై పెద్దగా దృష్టి సారించలేదు. ప్రస్తుతం వైఎస్ తనయుడు వైఎస్ జగన్ సిఎంగా ఉన్నప్పటికీ, ఆధునీకరణ పనులకు పెద్దగా ప్రాధాన్యత లభించకపోవడం చర్చనీయాంశంగా మారింది.కృష్ణా డెల్టాలో 13.08 లక్షల ఆయకట్టు స్థిరీకరణకు రూ.4,573 కోట్లను, గోదావరి డెల్టాలో 10.38 లక్షల ఎకరాల కోసం రూ.3,361 కోట్లను, నెల్లూరులో పెన్నా డెల్టాలోని 2.47 లక్షల ఎకరాల కోసం 1,215.64 కోట్లను కేటాయిస్తున్నట్లు 2009లో అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. సాగునీటి కాల్వలు, డ్రైన్‌లను అభివృద్ధి చేయడంతోపాటు, కాల్వల షట్టర్లు, హెడ్ వర్క్స్ పనులను చేపట్టాల్సి ఉంది. ఏ డెల్టాలోనూ 50 శాతానికి మించి పనులు జరగలేదు. ఎనిమిదేళ్ల నుంచి డెల్టా ఆధునికీకరణకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు కూడా అంతంత మాత్రంగానే ఉంటోంది. కృష్ణా డెల్టాలో రూ.4,573 కోట్లకుగానూ ఈ ఏడాది ఫిబ్రవరినాటికి రూ.2,636.95 కోట్లను ఖర్చు చేసినట్లు జలవనరులశాఖ అధికారులు చెబుతున్నారు. గోదావరి డెల్టాలో రూ.3,361 కోట్లకుగానూ రూ.1,556.05 కోట్లను, పెన్నా డెల్టాలో రూ.1,215.64 కోట్లకు రూ.733.57 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. మూడు డెల్టాల ఆధునికీకరణ పనులు పూర్తి చేసేందుకు ఇంకా రూ.5,288.45 కోట్ల అవసరం ఉంది.కొత్త ఎస్ఎస్ఆర్ ప్రకారం పూర్తిస్థాయిలో డెల్టాలను అభివృద్ధి చేయాలంటే కనీసం ఆరేడు వేల కోట్ల రూపాయల అవసరం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. కానీ, తాజా బడ్జెట్‌లో మూడు డెల్టాలకు రూ.131.24 కోట్లనే ప్రభుత్వం కేటాయించింది. డెల్టాలకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) పనులకు కూడా చాలవనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

## గంగమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే

చిత్తూరు శ్రీ తాతయ్య గుంట గంగమ్మ జాతర లో భాగంగా ఆలయం వద్ద మంగళవారం నిర్వహించిన తొలి పూజలో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తనను కలిసిన మీడియా ప్రతినిధులతో భూమన మాట్లాడారు. ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ ఈ రోజు నిర్వహించే చాటింపుతో తిరుపతి గంగమ్మ జాతర ప్రారంభం అవుతుంది. ఈ దేశంలోనే అత్యంత ప్రాచీనమైన పండగ ఇది. ముఖ్యంగా పేదవాళ్ల పండుగ. మన గ్రామ దేవత పండుగ ఇది. దాదాపు తొమ్మిది వందల సంవత్సరాలుగా గంగమ్మ జాతర జరుగుతోంది. శ్రీ వెంకటేశ్వరస్వామి కి చెల్లెలుగా అమ్మవారికి స్వామి సారె అందుతుంది. ఆనవాయితీ ప్రకారం జాతర ప్రారంభం రోజున వర్షం కురుస్తుంది. ఈ రోజున కూడా ఆరంభానికి శుభసూచకంగా వర్షపు జల్లులు పడుతున్నాయి. ప్రజలందరికీ చాలా మంచి జరుగుతుందనడానికి ఇదో సంకేతం. ఈ సంవత్సరం కూడా జాతరను వైభవోపేతంగా జరపాలని నిర్ణయించడం జరిగింది. తిరుపతి ప్రజల అందరి సహకారంతో శ్రీ తాతయ్య గుంట గంగమ్మ జాతర అత్యద్భుతంగా జరుగుతుంది. అని భూమన కరుణాకర రెడ్డి పేర్కొన్నారు.

## బెట్టింగ్ ముఠా అరెస్టు

పాలకొల్లు పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న మహిళాతో పాటు 14 మందిని అరెస్ట్ చేసి వారి నుండి 2.76 లక్షలు, భారీ టివి ,10 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ యు రవి ప్రకాష్ చెప్పారు.పాలకొల్లు పోలీస్ స్టేషన్ లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు చెప్పారు.పాలకొల్లు 31 వ వార్డు గౌతమి నగర్ కు చెందిన లంక కృష్ణ మాధవి గత కొంత కాలంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పక్కా సమాచారంతో పట్టణ సిఐ షేక్ అఖిల్ జామా, ఎస్ ఐ రెహమాన్ కానిస్టేబుల్ లు రమేష్ సత్తిబాబు,కుమార్ రాజు,మోజెస్, బాలాజీ, శ్రీను బాబు లు దాడి చేసి వీరిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

## గుండెపోటుతో ఇంటర్ విద్యార్థి పరీక్షా కేంద్రంలో మృతి

నెల్లూరు నెల్లూరు జిల్లా గూడూరులో డిఆర్ డబ్ల్యూ పరీక్ష కేంద్రం లో పరీక్షలకు వచ్చిన విద్యార్థి మృతి చెందాడు. సైదాపురంకు చెందిన సతీష్ అనే విద్యార్థి ఇంటర్ ద్వితీయు సంవత్సరం పబ్లిక్ పరీక్ష వ్రాసేందుకు వచ్చి గుండెపోటుతో అశ్వస్తత కు గురి అయ్యాడు. గమనించిన పోలీస్ సిబ్బంది, కళాశాల యాజమాన్యం సాయంతో హాస్పిటల్ కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పరువు హత్యను రాజకీయం చేస్తున్నారు

విశాఖపట్నం తెలంగాణ సరూర్ నగర్ లో జరిగిన పరువు హత్యను ఉ ద్దేశపూర్వకంగానే బిజెపి పార్టీ ఒక మతానికి అంటగట్టి రాజకీయం చేయాలని చూస్తోందని విశాఖలో మహిళా చేతన, ముస్లిం థింకర్ ఫారం ఆరోపించాయి.గతంలో కూడా అనేక పరువు హత్యలు జరిగిన గాని పట్టించుకోని కొన్ని పార్టీలు ఒక వర్గానికి చెందిన వ్యక్తులు ఈ ఘతకా నికి పాల్పడడంతో దీనికి రాజకీయ

రంగు పులుముకున్న రని ఆరోపించా రు. ఆసీన్ సుల్తానా, నాగరాజులు తమకు ప్రాణహాని ఉందని పోలీసు లకు ఫిర్యాదు చేసిన పోలీసులు సరైన చర్య తీసుకోకపోవడం వల్లనే ఇలాంటి దురదృష్టకర సంఘటన జరిగిందని అన్నారు. ఈ సంఘటనను ఒక వర్గానికి అంటగట్టి రాజకీయ లబ్ధి పొందుదామని అనుకున్న బిజెపి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఈ మీడియా సమావేశంలో పలు మహిళా సంఘాలు, వివిధ ముస్లిం సంఘాలు చెందిన నేతలు హాజరయ్యారు.

# కూతురు కనిపించలేదని తల్లి ఆవేదన

**తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే గంగుల**

**బాలిక ఆచూకీ కోసం ముమ్మర చర్యలు చేపట్టండి**

**పోలీసులను ఆదేశించిన ఎమ్మెల్యే గంగుల**

ఆళ్లగడ్డ ఆళ్లగడ్డ పట్టణ పరిధిలోని రామలక్ష్మి కొట్టాల చెందిన బిజిలీ నాగేష్ కుమార్తె బిజిలి శివలక్ష్మి గత శుక్రవారం స్థానిక సెంట్ ఆన్స్ పాఠశాలలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయటానికి వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో అదే రోజు శుక్రవారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో శివ లక్ష్మి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు అయితే ఐదు రోజులు గడుస్తున్నా ఇంతవరకు ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఈ విషయాన్ని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి కి తెలిపారు విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి వెంటనే స్పందించి పట్టణ పోలీసులకు ఫోన్ చేసి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు ఐదు రోజులు గడుస్తున్నా ఇంతవరకు ఆచూకీ లభ్యం కాక పోవడం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేశారు పోలీసులు వెంటనే ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాలని వారిని ఆదేశించారుబాలిక ఆచూకీ కనుక్కొని తల్లిదండ్రులకు వెంటనే అప్పగించాలని వారు పోలీసులను కోరారు. ప్రజలకు ఏదైనా సమస్య వస్తే వెంటనే స్పందించే వ్యక్తి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి. ప్రజా సమస్యల పరిష్కారంలో తనదైన శైలిలో వెంటనే సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం జరిగేంత వరకు అన్ని రకాల చర్యలు తీసుకుంటారు అందులో భాగంగానే బిజిలి శివలక్ష్మి తల్లిదండ్రులు ఐదు రోజులు గడుస్తున్నా తమ కూతురు ఆచూకీగురించి ఎలాంటి సమాచారం రాకపోవడంతో మంగళవారం ఎమ్మెల్యే స్వగృహంలో తమ కూతురు ఆచూకి కోసం స్థానిక పట్టణ పోలీసులు ఆశ్రయించామని ఇంతవరకూ వారి వద్ద నుండి ఎలాంటి సమాచారం అందలేదని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దృష్టికి తీసుకు వెళ్ళడంతో ఆయన తక్షణమే స్పందించి వెంటనే స్థానిక పట్టణ పోలీసులకు ఫోన్ చేసి ఐదు రోజులు గడుస్తున్నా బాలిక ఆచూకీ ఇంకా తెలియడం లేదని వెంటనే అన్ని రకాల చర్యలు చేపట్టి గాలింపు చర్యలు ముమ్మరం చేయవలసినదిగా పోలీసులను ఆదేశించారు అనంతరం బాలిక తల్లిదండ్రులను ఓదార్చి త్వరలోనే బాలిక ఆచూకీ కనుగొని బాలిక తల్లిదండ్రులకు పోలీసులు అప్పగిస్తామని తెలిపారు

# ప్రొద్దుటూరులో టీడీపీ కి ఊహించని ఝలక్

కడప కడప జిల్లా ప్రొద్దుటూరు స్థానిక మునిసిపల్ ఆరవ వార్డు ఎర్రన్న కొట్టాలలో దాదాపు నూరు కుటుంబాలు టీడీపీ నుండి వైసీపీలో చేరాయి. ఆరవ వార్డు వైసీపీ కౌన్సిలర్ జయంతి ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్ పాతకోత బంగారు మునిరెడ్డి సమక్షంలో టీడీపీ నాయకులు ఎం.ఆర్.పీ.ఎస్ సుధాకర్ మాదిగ, డీలర్ సుధాకర్ తో పాటు దాదాపు నూరు కుటుంబాలు వైసీపీ తీర్థం పుచ్చుకున్నాయి. టీడీపీ ప్రొద్దుటూరు ఇంచార్జి జి.వి. ప్రవీణ్ కుమార్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ వార్డు నుండి టీడీపీ నాయకులు కార్యకర్తలు వైసీపీలో చేరటం ఇక్కడ గమనార్హం. తాజాగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు రాబోవు ఎన్నికల నేపథ్యంలో పొత్తులకు సై అని, రాజ్యాధికారమే పరమావధిగా ఎలాంటి త్యాగాలకైనా సిద్ధం అని ప్రకటించగా, ప్రొద్దుటూరులో టీడీపీ నుండి వైసీపీలో చేరికలు ప్రాధాన్యత సంతరించుకొంది. గత మునిసిపల్ ఎన్నికలలో ఆరవ వార్డులో సరయిన అభ్యర్థిని టీడీపీ ఎంపిక చేయటంలో చేసిన తప్పిదాలే, నేడు వైసీపీలో చేరికలకు కారణంగా చెప్పవచ్చు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ వైసీపీ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కొరకు పెద్దపీఠ వేస్తుందని, సుధాకర్ మాదిగ తమ పార్టీలో చేరటం ఎంతో సంతోషంగా ఉందని, రాబోవు రోజుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీలోకి మరిన్ని చేరికలు జరగనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు, మునిసిపల్ వైస్ చైర్మన్ పాతకోత బంగారు మునిరెడ్డి, వైసీపీ అధికార ప్రతినిధి పగిడాల దస్తగిరి, ఆరవ వార్డు వైసీపీ కౌన్సిలర్ జయంతి, నాలుగవ వార్డు వైసీపీ కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, ఆరవ వార్డు వైసీపీ నాయకులు సురేష్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఆరవ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# టెన్త్ పేపర్ లీక్ కేసులో విస్తుపోయే నిజాలు!

విజయవాడ, మే 10 టెన్త్ పేపర్ లీకేజీ వ్యవహారంలో నారాయణ సంస్థల అధినేత టీడీపీ మాజీ మంత్రి నారాయణను పోలీసులు మంగళవారం (మే 10) అదుపులోకి తీసుకున్నారు. ఏప్రిల్ 4న నారాయణ కాలేజి వైస్ ప్రిన్సిపల్‌తో సహా మరికొందరిని అరెస్టు పోలీసులు అరెస్ట్ చేశారు. వీరితోపాటు పేపర్‌లీక్ ఉదంతంలో పాలుపంచుకున్న పలువురు టీచర్లను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.నారాయణ విద్యాసంస్థల సిబ్బంది ఫోన్లలో కీలక డేటా.. పోలీసుల దర్యాప్తులో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకొచ్చాయి. నారాయణ విద్యాసంస్థల సిబ్బంది వినియోగించిన ఫోన్లలో కీలక డేటా బయటపడింది. కేవలం తమ విద్యాసంస్థలకు ర్యాంకులు రావాలనే దురాలోచనతో నారాయణ సిబ్బంది బరితెగింపు చర్యలకు పాల్పడింది. ప్రశ్నపత్రాలను ఫొటోలు తీసి, షేర్‌చేసి తమ విద్యార్థులకే ఎక్కువ మార్కులు వచ్చేలా అక్రమాలకు తెరదించారు. ఎవరి ఆదేశాలమేరకు ఈ వ్యవహారాన్ని నడిపారు, ఎన్నేళ్లుగా ఇదంతా నడుస్తుందన్న దానిపై చిత్తూరు పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. ఇక వ్యవహారంపై ఏపీ ప్రభుత్వం తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకునే ఈ విధమైన విద్యాసంస్థలపై ఏపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ఈ కేసులో ఏపీ పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేపడుతున్నారు.మాజీ మంత్రి నారాయణ అరెస్టు ఇలా.. నారాయణ సంస్థల అధినేత టీడీపీ మాజీ మంత్రి నారాయణను హైదరాబాద్ లోని ఆయన నివాసంలో ఏపీ సీఐడీ పోలీసులు ఈ రోజు అరెస్ట్ చేశారు. పేపర్ లీకేజీ కేసులో ఆయన్ని అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. ఐతే ఏ నేరం కింద నారాయణను అరెస్ట్ చేశారనే విషయాన్ని పోలీసులు అధికారికంగా ఇంకా ప్రకటించలేదు.కాగా, ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి పరీక్షల సందర్భంగా ప్రశ్న పత్రాలు వరుసగా లీక్ అయ్యాయి. ఈ లీకేజీ వెనుక శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థల ప్రమేయం ఉందని ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి విజయవాడ నుంచి ప్రత్యేకంగా ఏపీ సీఐడీ బృందం హైదరాబాద్‌కు చేరుకుంది. ప్రశ్న పత్రాల లీకేజీ కేసులో పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులను కూడా అరెస్టు చేసినట్లు తెలుస్తోంది.

# బీ ఫార్మసీ విద్యార్థిని కేసులో కొత్త విషయాలు

అనంతపురం, మే 10,బీ-ఫార్మసి విద్యార్థిని మృతి ఘటనలో మరో కీలక పరిమాణం చోటు చేసుకుంది. విద్యార్థిని పై అత్యాచారం జరగలేదని చెప్పిన పోలీసులు ఆ తర్వాత రేప్ కేస్ పెట్టారు. కానీ తాజాగా విద్యార్థినిపై అత్యాచారం జరగలేదని, నిందితుడు చెప్పిన వివరాల మేరకు సెక్షన్ 376 నమోదు చేసినట్టు ధర్మవరం డీఎస్పీ రమాకాంత్ వివరించారు. పోస్టుమార్టం నివేదికలో కూడా అత్యాచారం జరలేదని, ఇది హత్య కాదని తేల్చినట్టు డీఎస్పీ వెల్లడించారు. విద్యార్థిని శరీరంపై కూడా ఎలాంటి గాయాలు లేవని, నిందితుడు విద్యార్థినితో పెళ్లి చేసుకుంటానని చెప్పి, శారీరకంగా కలిసిన నేపథ్యంలోనే రేప్ కేస్, చీటింగ్ కేస్ నమోదు చేసినట్టు వివరించారు. పోస్టుమార్టంలో అత్యాచారం జరగలేదని, హత్య కాదని వైద్యులు తేల్చారని పోలీసులు చెప్పారు. ఫోరెన్సిక్ నివేదిక వచ్చిన తరువాత ఇంకా వాస్తవాలు తెలుస్తాయన్నారు. ఈ ఘటనపై ఎన్నో ప్రశ్నలు, అనుమానాలు రేకెత్తుతున్నాయి.సత్యసాయి జిల్లా గోరంట్లలో జరిగిన బీ-ఫార్మసీ విద్యార్థిని మృతి ఘటనపై బీజేపీ నాయకులు తీవ్రంగా స్పందిస్తున్నారు. బీజేపీ నేత భాను ప్రకాష్ రెడ్డి.. నిన్న బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆ తర్వాత హత్య జరిగిన స్థలాన్ని కూడా పరిశీలించారు. విద్యార్థిని మృతదేహానికి అంత హడావిడిగా పోస్టుమార్టం చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. విద్యార్థిని శరీరంపై గాయాలు స్పష్టంగా ఉన్నాయన్నారు. విద్యార్థిని తల్లిదండ్రులు ఇది హత్య అని చెబుతుంటే పోలీసులు ఎందుకు ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని నిలదీశారు. దీని వెనుక వైసీపీ నాయకుల ఒత్తిడి ఉందని ఆరోపించారు.ఆంధ్రప్రదేశ్ లోని శ్రీ సత్యసాయి జిల్లాలో అనుమానాస్పద రీతిలో బీ-ఫార్మసీ విద్యార్థిని మృతి చెందింది. వ్యవసాయ పొలంలోని ఓ షెడ్డులో ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ప్రేమించిన వ్యక్తే నమ్మించి హత్య చేశాడని తల్లిదండ్రుల ఆరోపిస్తుండగా.. ఆమెది ఆత్మహత్యేనని స్థానిక డీఎస్పీ రమాకాంత్ పేర్కొనడంపై మృతురాలి బంధువులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి తల్లిదండ్రుల ఆరోపణల మేరకు మరోసారి శవపరీక్ష నిర్వహించారు.

# మండిపడుతున్న టీడీపీ నేతలు

తెలుగు రాష్ట్రాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. పదోతరగతి ప్రశ్నాపత్రాల లీకేజీ వెనుక నారాయణ, చైతన్య విద్యాసంస్థల ప్రమేయం ఉందంటూ ఇటీవల ఏపీ సీఎం జగన్ బహిరంగంగానే వ్యాఖ్యానించిన నేపథ్యంలో నారాయణ విద్యాసంస్థల అధినేత నారాయణను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. హైదరాబాద్ కొండాపూర్‌కు వచ్చి నారాయణను చిత్తూరు పోలీసులు తీసుకెళ్లారు. మాజీ మంత్రి నారాయణ వెంట ఆయన భార్య రమాదేవి ఉన్నారు. మరోవైపు టెంత్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో బాధ్యులైన వారిని వదిలిపెట్టేది లేదు, కుట్ర పన్ని ఈ వ్యవహారం నడిపారు. ఎన్ని డ్రామాలు చేసినా క్షమించేది లేదన్నారు మంత్రి బొత్స సత్యనారాయణ.

నారాయణ అరెస్టును ఖండిస్తున్నాం:కళా వెంకట రావు

నారాయణ అరెస్టు విషయంలో రాజకీయ కక్షతో చేసిన అరెస్టు తప్పా కారణం చెప్పే పరిస్థితి లేదు. ప్రజలందరూ అర్థం చేసుకుని తిరగబడే రోజు వస్తుంది.జిల్లా పార్టీ తరపున నారాయణ అరెస్టును ఖండిస్తున్నాం. గత మూడేళు ్ళగా జగన్, సజ్జల్ ఫ్రస్టేషన్ లోకి వెళ్లిపోయారు. సజ్జల, జగన్ మానసికంగా బాధపడుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి పక్షాలు మాట్లాడితే వాటిలో మంచిని తీస్కుంటారు. చెడును విడిచి పెడతారు. తప్పుడు కేసులు పెట్టడం, భయాందోళనకు గురి చేయడం, అరెస్టులు చేయడం చేస్తున్నారు. అసెంబ్లీని కూడా కౌరవ సభ చేసేసారు

ఇది అధికార దుర్వినియోగమే :అశోక్ గజపతి రాజు

నారాయణ అరెస్టుపై స్పందించారు మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు. టీడీపీ నాయకులు కేసులు పెట్టారు? పెడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది. నా పైన కేసులు పెట్టారు. కళా వెంకట రావుపైన కేసులు పెట్టి అరెస్టు చేశారు. ఒక్క టీడీపీ నాయకులు పైనే కాకుండా 150 కి పైగా దేవాలయాల పైన దాడులు జరిగాయి. వైసీపీ ప్రభుత్వం చాలా దారుణంగా వ్యవహరిస్తోంది. ఇది ఒక రెడీక్లాస్ ప్రభుత్వం. ప్రజా హితం కోసం కాకుండా అధికార దుర్వినియోగం కోసం పని చేస్తున్నారు. మూడు రాజధానుల విషయంలో వికేంద్రీకరణ అనే కొత్త పదాన్ని తీసుకువచ్చారు

అక్రమ అరెస్టులతో విద్యార్థులకు మేలు జరగదు: నారా లోకేష్చేతగానితనాన్ని ఇతరులపైకి నెట్టేయడం.. చేసిన నేరాలు, అక్రమాలకు ఇతరుల్ని బాధ్యులని చెయ్యడం జగన్ అండ్ కో ట్రేడ్ మార్క్. పదో తరగతి పేపర్ లీక్ ఘటనలపై మంత్రి బొత్స, సిఎం జగన్ విరుద్ధ ప్రకటనలు ప్రజలంతా చూసారు. ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చుకోవడంతో పాటు రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే నారాయణపై అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేశారు. సంబంధం లేని కేసులో నారాయణ దంపతులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. పేపర్ లీకేజ్ ఘటనల్లో అసలు సూత్రధారులైన వైసీపీ నేతల్ని వదిలేసి టీడీపీ నేతల్ని అరెస్ట్ చేయించి సైకో ఆనందం పొందుతున్నారు. ఈ అక్రమ అరెస్టుల వల్ల పరీక్షలు రాసిన విద్యార్థులకు ఎటువంటి మేలు జరగదు.కక్ష్య సాధింపుల్లో భాగంగానే టీడీపీ నేత నారాయణను ప్రభుత్వం అరెస్ట్ చేయించిందని ఏపీ టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆరోపించారు. జగన్ తన అసమర్థ పాలన నుంచి దృష్టి మరల్చేందుకే ఈ అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. మూడేళ్ల పాలనలో కక్షసాధింపు చర్యలకే ప్రాధాన్యతిచ్చి టీడీపీ నేతలను అక్రమ అరెస్టులు, అక్రమ నిర్బంధాలకు పాల్పడ్డారని మండిపడ్డారు.ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో మాజీ మంత్రి నారాయణ అరెస్ట్ ని ఖండిస్తున్నాం. ప్రశ్నాపత్రాల లీకేజీయే జరగలేదని స్వయాన మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు. ఈ అరెస్ట్ రాజకీయకుట్రతో జరిగింది. వైసీపీ క్షేత్రస్థాయిలో బలహీనపడుతోంది.

## నారాయణ అరెస్టును ఖండించిన అచ్చెన్నాయుడు



విజయవాడ మాజీ మంత్రి నారాయణ అక్రమ అరెస్ట్ ను తీవ్రంగా ఖండిస్తున్నామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. జగన్ రెడ్డి తన అసమర్థ పాలన నుంచి దృష్టి మరల్చేందుకే ఈ అక్రమ అరెస్ట్ లు. ఏ కేసులో, ఎందుకు అరెస్ట్ చేస్తున్నారో కూడా పోలీసులు చెప్పకపోవడం జగన్ రెడ్డి అప్రజాస్వామిక పాలనకు నిదర్శనం. మూడేళ్ల పాలనలో కక్షసాధింపు చర్యలకే ప్రాధాన్యత ఇచ్చి.. టీడీపీ నేతలను అక్రమ అరెస్ట్ లు, అక్రమ నిర్బంధాలకు పాల్పడ్డారు. జగన్ రెడ్డి అవినీతిని, విధ్వంస పాలనను ప్రశ్నించిన వారిపై వేల సంఖ్యలో అక్రమ కేసులు నమోదు చేశారని అన్నారు.ప్రజలు అధికారం కట్టబెట్టింది అభివృద్ధి చేయడానికి కానీ.. ప్రతిపక్ష పార్టీల నేతలపై కక్షసాధింపు చర్యల కోసం కాదు. ఎలాంటి నోటీసులు లేకుండా మాజీ మంత్రి పట్ల ఇష్టానుసారంగా వ్యవహరించారు. రోజురోజుకూ జగన్ రెడ్డి పట్ల పెరుగుతున్న ప్రజా వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకు డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడుతున్నారు. రాష్ట్రంలో పదో తరగతి ప్రశ్నాపత్నాల లీకేజీ ఎక్కడా జరగలేదని స్వయంగా విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఓ వైపు చెబుతుంటే.. మరోవైపు ఇదే వ్యవహారంలో నారాయణను ఏవిధంగా అరెస్ట్ చేస్తారు? రాజకీయ కుట్రలో భాగంగానే నారాయణను అరెస్ట్ చేశారు. పరీక్షల నిర్వహణలో విఫలమై ఆ నెపాన్ని నారాయణపై నెట్టారు. అక్రమ అరెస్ట్ ల పట్ల భవిష్యత్ లో మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు.

## బద్వేలు పట్టణ అభివృద్ధికి పాలకులు, ప్రభుత్వ అధికారులు కృషి చేయాలి

బద్వేలు అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని ఉన్నట్లు బద్వేల్ పట్టణంలో కావలసినంత ప్రభుత్వ భూమి ఉంది ప్రభుత్వం వనరులు ఉన్నాయి, ఇంతవరకు పట్టణాన్ని అభివృద్ధికి నోచుకోక పోవడం పాలకుల నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి తాలూకా కన్వీనర్ ఎం.పిచ్చయ్య ,దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు పి. వెంకటరమణ పేర్కొన్నారు. పూలే అంబేద్కర్ రాజ్యాధికార సాధన సమితి ఆధ్వర్యంలో బద్వేల్ పట్టణాన్ని అభివృద్ధి పదంలో నడిపించాలని బద్వేల్ ఆర్డిఓ గారికి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా పిచ్చయ్య వెంకటరమణ మాట్లాడుతూ.. బద్వేల్ తాలూకా అభివృద్ధి చెందాలంటే ముఖ్యంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, అదేవిధంగా బద్వేల్ పట్టణంలో ఇంతవరకు ప్రభుత్వ కాలేజీ లు లేకపోవడం దురదృష్టకరమని, ముఖ్యంగా వయోవృద్ధులు ఉద్యోగస్తులు సేద తీర్చుకొనుటకు పార్కింగ్ సౌకర్యం లేక రోడ్లవెంబడి వాకింగ్ చేస్తూ ప్రమాదాలకు గురి అవుతున్నారని ఈ విషయమై పాలకపక్షం ప్రతిపక్షం పార్కు ఏర్పాటు చేయుటకు కృషి చేయలేదని వారు విమర్శించారు. నాగుల చెరువు, బాకరాపేట చెరువులను సుందరీ కరణంగా తీర్చిదిద్ది పర్యాటక కేంద్రంగా చేయాలని, అదేవిధంగా క్రీడాకారులకు స్టేడియం లేక పోవడం బాధాకరం తక్షణమే స్టేడియంలో ఏర్పాటు చేయాలి, బద్వేల్ నియోజకవర్గం లో కళాకారులకు క్షేత్రం ఏర్పాటు చేయాలని, చిల్డ్రన్ పార్క్ ఏర్పాటు చేయాలని ఆర్ డి ఓ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ విషయమై ఆర్డీవో గారు స్పందిస్తూ బద్వేలు పట్టణ అభివృద్ధికి ఈ కనీస అవసరాలు ప్రభుత్వానికి నివేదిక పంపుతామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిన్నయ్య, పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి బద్వేలు పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, దళిత నాయకుడు ఓబయ్య చిన్నప్ప ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## విమానాలపై తుఫాన్ ప్రభావం

విశాఖపట్నంవిమానాలపై అసని తుఫాన్ ఎఫెక్ట్ కనిపిస్తోంది. భారీ వర్షాలు, ఈదురు గాలుల వల్ల విశాఖకు వచ్చే పలు విమానాలు రద్దు అయ్యాయి. ఇండిగో తన 23 విమాన సర్వీసులను రద్దు చేసింది. ఎయిర్ ఏషియాకు చెందిన ఢిల్లీ- విశాఖ, బెంగళూర్- విశాఖ, ముంబై- రాయపూర్- విశాఖ , ఢిల్లీ- విశాఖ విమానాలు రద్దు అయ్యాయి. దీంతో పలు చెన్నైకి వెళ్లాల్సిన పలు విమానాలను కూడా రద్దు చేశారు. హైదరాబాద్, విశాఖ పట్నం, జైపూర్, ముంబై నుంచి చెన్నైకి వెళ్లే 10 విమాన సర్వీసులను రద్దు చేశారు. బంగాళాఖాతంలో అసని తీవ్ర తుఫాను కారణంగా పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. చెన్నై ఎయిర్ పోర్టు నుంచి హైదరాబాద్, విశాఖ, జైపూర్, ముంబై వెళ్లే ఫ్లైట్లు రద్దు చేసినట్లు ప్రకటించారు అధికారులు. ఇప్పటికే విశాఖ నుంచి అన్ని ఇండిగో విమానాలను ముందు జాగ్రత్తగా రద్దు చేశారు. మొత్తం 23 సర్వీసులు రద్దు చేసినట్లు ప్రకటించింది ఇండిగో. ఎయిర్ ఏషియాకు చెందిన ఢిల్లీ-విశాఖ, బెంగళూరు-విశాఖ సర్వీసులు రద్దయ్యాయి. ఎయిర్ ఇండియాకు చెందిన ముంబై-రాయ్ పూర్- విశాఖ, ఢిల్లీ-విశాఖ ఫ్లైట్లు రద్దయ్యాయి. తుఫాను దృష్ట్యా తీవ్ర గాలుల వల్ల ముందు జాగ్రత్తగా విమాన సర్వీసులు రద్దు చేసినట్లు ప్రకటించాయి విమానసంస్థలు.విజయవాడ, రాజమహేంద్రవరం, హైదరాబాద్, ముంబై, చెన్నై నుంచి విశాఖకు వచ్చే ఇండిగో విమాన సర్వీసులన్నింటినీ తాత్కాలికంగా రద్దు చేశారు. ఆర్డీవో కార్యాలయాల కంట్రోల్ రూమ్లను అధికారులు ఏర్పాటు చేశారు. అలాగే తీరప్రాంత మండలాల్లో ఉన్న ఉద్యోగులను సైతం అధికారులు అప్రమత్తం చేశారు.

## గుంటూరు ఎగ్జిబిషన్ లో అగ్ని ప్రమాదం

గుంటూరు గుంటూరు గుంట గ్రౌండ్ ఎగ్జిబిషన్ లో అగ్నిప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ తో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో దుకాణాలు దగ్ధమయ్యాయి. ఈ మంటలతో పెద్దఎత్తున పొగ అలుముకుంది. చుట్టుపక్కల ప్రాంతాలను పొగ కమ్మేయడంతో ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురైయ్యారు.సమాచారం అందుకుని రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది, ఎగ్జిబిషన్ లో మంటలు ఆర్పుతున్నారు.

# ఈనెల14న ఛలో రాజ్ భవన్

## వీసీ ని రీకాల్ చేయాలి విద్యార్థి సంఘాల వెల్లడి

ఎమ్మిగనూరు ఎమ్మిగనూరు పట్టణంలో రాయలసీమ యూనివర్సిటీ పరిరక్షణకై,వీసీ ని రీకాల్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14న ఛలో రాజ్ భవన్ కు పిలునిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయకార్యదర్శి విజేంద్ర, పీ డీ ఎస్ యూ పట్టణ కార్యదర్శి నరసింహారెడ్డి,డిఎస్ఎఫ్ తాలూక కార్యదర్శి సురేంద్ర,యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఉదయ్ , ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజీవ్ లు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వాసి అయిన వీసి ఆనంద రావు రాయలసీమ యూనివర్సిటీ ని పది సంవత్సరాలు వెనక్కి తీసుకెళ్లి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంచారని విమర్శించారు.అదేవిధంగా 153 విద్యార్థుల కుటుంబాలకు తీవ్ర నష్టం చేసి,విద్యార్థుల్లో మనోధైర్యాన్ని కోల్పోయేలా చేసి,వారి జీవితాన్ని నాశనం చేసారని విమర్శించారు.హైకోర్టులో స్టే ఉన్న ప్రొఫెసర్లకు ఉన్నత పదవులు కట్టబెట్టడం అంటే యూనివర్సిటీని అమ్మడమే అని ఎద్దేవా చేశారు. అదేవిధంగా విద్యార్థులకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించిన 13 మంది విద్యార్థులను సస్పెండ్ చేయడం దుర్మార్గం అని అన్నారు.డిటెన్షన్ విధానం వల్ల విద్యార్థులను విద్యకు దూరం చేయడం సిగ్గుచేటని అన్నారు.153 మంది విద్యార్థులను పరీక్ష అనుమతించాలని,అక్రమ కేసులు,అక్రమ సస్పెన్షన్ లు ఎత్తివేయాలని,అక్రమ ప్రొఫెసర్లను పదవుల నుండి తొలగించాలని,విద్యార్థుల జీవితాన్ని నాశనం చేసి,యూనివర్సిటీ స్వయంప్రతిపత్తిని బజారుకు ఈడుస్తున్న రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఆనందరావును వెంటనే వీసీ పదవి నుంచి రీకాల్ చేసి, యూనివర్సిటీని అభివృద్ధి పథంలో నడిపించే నూతన వీసీ ను నియమించి యూనివర్సిటీ ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14వ తేదీన రాజ్ భవన్ ముట్టడికి జిల్లాలోని అన్ని విద్యార్థి సంఘాలు యువజన సంఘాలు విద్యార్థినీ విద్యార్థులు యువకులు మేధావులు ప్రజాసంఘాల నాయకులు మద్దతు ఇవ్వాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు.




# రైతుకు మేలు చేకూర్చడమే ప్రభుత్వ ధ్యేయం

## జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామారాజు



కడప మే 10 : రైతుకు అన్ని విధాలా మేలు చేకూర్చడమే ప్రభుత్వ ధ్యేయం అని అందుకు తగిన కార్యాచరణ చర్యలను ప్రణాళిక బద్ధంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని స్పందన హాలులో జేసీ సాయికాంత్ వర్మతో కలిసి.. వ్యవసాయ, అనుబంధ శాఖల జిల్లా అధికారులతో.. జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు మాట్లాడుతూ రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామాల్లోనే రైతులకు విస్తృతమైన సేవలు అందిస్తోందన్నారు. వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం.. ఆర్బికేల పరిధిలోని అగ్రి ల్యాబుల సేవలను మరింత విస్తృతం చేయాలన్నారు. అలాగే "వైఎస్ఆర్ యాంత్రిక సేవ" పథకంలో భాగంగా.. అన్ని ఆర్బికేల పరిధిలో రైతు సంఘాల ద్వారా "కమ్యూనిటీ హైరింగ్ సెంటర్స్" ను ఏర్పాటు, నిర్వహణ వేగవంతం చేయాలన్నారు. దేశానికి వెన్నెముక అయిన రైతుకు అన్ని విధాలా న్యాయం జరిగేలా.. సంబంధిత శాఖల అధికారులు సహకరించాలన్నారు. ప్రతి రైతు వారు సాగుచేసే పంటల వివరాలను ఖచ్చితంగా ఈ-క్రాపింగ్ నమోదు చేయించుకునేలా వ్యవసాయ అధికారులు, గ్రామీణ వ్యవసాయ సహాయకులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో.. ప్రభుత్వ సేవల గురించి ప్రస్తావిస్తూ.. జిల్లాలో ఉద్యాన పంటలకు అమితమైన ఆదరణ లభిస్తోందని, ఆ దిశగా రైతులకు రాయితీతో స్పిన్ క్లర్లు, బిందు పరికరాలు అందిస్తూ.. ఉద్యాన రైతులకు లాభాలు చేకూర్చే చర్యలు చేపట్టాలన్నారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో.. వ్యవసాయ, ఉద్యాన సహాయకుల సేవలు విస్తృతం చేయడం జరుగుతోందన్నారు. జిల్లాలో మత్స్య పరిశ్రమను మరింత అభివృద్ధి చేయాలని, చేపల వినియోగాన్ని పెంచాలన్నారు. జిల్లాలో ఆక్వా హబ్ ల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలన్నారు. అంతే కాకుండా.. జిల్లాలో పట్టు పరిశ్రమ అభివృద్ధికి మరింత కృషి చేయాలన్నారు. జిల్లాలో మల్బరీ సాగు విస్తీర్ణం పెంచి.. పట్టు పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. సీజన్ వారీగా ఆయా ప్రాంతాల్లో పండించే పంటలు, వాటికి ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణ, ఆయా పైర్లకు అందాల్సిన పోషక విలువలు, ఎరువుల వాడకం మొదలైన ప్రక్రియల నిర్వహణపై.. ముందస్తుగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు. రైతులు పండించిన పంట దిగుబడులను ప్రభుత్వ మద్దతు ధరలతో.. పౌర సరఫరాల శాఖ ద్వారా కొనుగోలు ప్రక్రియను సక్రమంగా చేపట్టాలన్నారు. రైతు సంఘాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేసే దిశగా.. సహకార సంఘాలు రైతులకు వెన్నుదన్నుగా నిలవాలన్నారు. జిల్లాలో అన్ని సీజన్లకు సంబంధించి.. రుణ ప్రణాళికను సక్రమంగా నిర్వహించి.. లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖలకు సంబంధించి ఆయా సీజన్లకు సంబంధించి యాక్షన్ ప్లాన్ ను.. క్రమం తప్పకుండా పాటించాలని, ప్రతి వారం ప్రగతి నివేదికలు సర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జేసీ సాయి కాంత్ వర్మ మాట్లాడుతూ.. రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం... రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామాల్లోనే రైతులకు విస్తృతమైన సేవలు అందిస్తోందన్నారు. సాగుచేసే పంటల వివరాలను ఖచ్చితంగా ఈ-క్రాపింగ్ నమోదు చేయించుకునేలా వ్యవసాయ అధికారులు, గ్రామీణ వ్యవసాయ సహాయకులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. మండల స్థాయిలో రైతుల అవసరాన్ని బట్టి.. ఎంత మేర విత్తనం అవసరం, ఎంతమేర ఎరువులు, పురుగు మందులు అవసరమో క్షుణ్ణంగా తెలుసుకొని.. జిల్లా స్థాయి సమీక్షలో ఆ వివరాలను నివేదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ జిల్లా అధికారి నాగేశ్వర రావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి వజ్రశ్రీ, "ఆత్మ" పిడి విజయకుమారి, ఫిషరీస్ ఎడి నాగరాజు, పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి రమణయ్య, సీఎంఎన్ఎఫ్ (ప్రకృతి వ్యవసాయం) డిపిఎం రామకృష్ణ, ఎల్డిఎం దుర్గా ప్రసాద్, మైనర్ ఇరిగేషన్ అధికారులు, వ్యవసాయ మార్కెటింగ్, కో.ఆపరేట్ తదితర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ ,ప్రహరీ గోడలను నిర్మించాలని వినతిపత్రం

కౌతాళం:మండలం కేంద్రం లో మోడల్ స్కూల్ నిర్మించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ప్రహరీ గోడ నిర్మించాలని మంగళవారం ఎమ్మెల్యే బలనాగి రెడ్డి కు అఖిల భారత విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ పేరుకే మన కౌతాళం మండలం అని కానీ నిరుపేద విద్యార్థుల కు విద్య అందక భారం అవుతుందని ఎంతో మంది నిరుపేదలు చదువు కు దూరమై కూలీలుగా మరతున్నారని ఎన్నో



సం అధికారులకు నాయకులకు విన్న వించు కున్న ఫలితం లేకపోయింది అని ఆవేదన వ్యక్తంచేశారు ఎప్పటికైన నాయకులు స్పందించి నిరుపేదలకు మోడల్ స్కూల్ ,ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రహరి గోడ నిర్మించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర, తాలుకా ఉపాధ్యక్షుడు కుమార్, గురు, బుడ్డి, మహేష్, ఉన్నారు.

# యువత అన్ని రంగాల్లో రాణించాలి

## టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చేన్న బసప్ప మరియు జిల్లా రైతు కార్యదర్శి వెంకటపతిరాజు




కౌతాళం :యువత క్రీడా రంగంలో రాణించాలని తల్లిదండ్రులు యువకులకు ప్రోత్సాహించాలని ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు, చెన్న బసప్ప, జిల్లా రైతు సంఘము ఉపాధ్యక్షులు వెంకటపతి రాజు పేర్కొన్నారు.కౌతాళం మండల కేంద్రమైన శ్రీకృష్ణ అవధూత ఆశ్రమంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి ఉపాధ్యక్షులు చెన్న బసప్ప గ మరియు జిల్లా రైతు కార్యదర్శి వెంకటపతి రాజు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో రాణించి మంచి పేరు ప్రతిష్టలు గ్రామానికి తీసుకు రావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టిప్పుసుల్తాన్, డాక్టర్ రాజానందు' రాజబాబు' కురువ వీరేష్, సునీల్, గౌటయ్య మరియు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓపెన్ ఇంటర్ పరీక్ష కేంద్రాలను తనిఖీ

డోన్ :ఓపెన్ ఇంటర్ పరీక్షల కేంద్రాలను కర్నూల్ జిల్లా జి సి డి ఓ అధికారిని లలిత కుమారి తనిఖీ చేశారు, స్థానిక పాతపేట లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఓపెన్ ఇంటర్ పరీక్షలు జరుగుచున్నవి, ఈసందర్భంగా ఫ్లైయింగ్ స్క్వాడ్ గా లలిత కుమారి ఓపెన్ ఇంటర్ కేంద్రాలను తనిఖీ చేశారు,అలాగే ఆ కేంద్రంలో మంచి నీటి వసతి గురించి అడిగి తెలుసుకున్నారు,రెండు సెంటర్స్ తనిఖీ చేశారు, ఈ రెండు కేంద్రంలోని 270 మంది హాజరయ్యారు, పరీక్షలు ప్రశాంతంగా జరుగుగుతున్నాయి తెలిపారు, ఈ కార్యక్రమంలో ఏ,బి సెంటర్ల సి ఓ లు సుబాన్ బాషా, రవి శేఖర్, డి ఓ లు సత్యనారాయణ, రాం ప్రసాద్, పాల్గొన్నారు



# కుర్ర భామ టాప్ లీగ్ లో చేరుతుందా..?



టాలీవుడ్ లో తెలుగు హీరోయిన్ల కంటే పరభాషా కథానాయికల హవానే ఎక్కువ ఉంటుందనేది అందరూ అంగీకరించే విషయమే. ఒకప్పుడు బాలీవుడ్ బ్యూటీలను ఇంపోర్ట్ చేసుకునే మేకర్స్.. ఇప్పుడు సౌత్ లోనే కన్నడ – మలయాళ ముద్దుగుమ్మలను తీసుకొస్తున్నారు. అలాంటి వారిలో యంగ్ బ్యూటీ కృతి శెట్టి ఒకరు.మెగా మేనల్లుడు పంజా వైష్ణవ్ తేజ్ డెబ్యూ మూవీ 'ఉప్పెన' తో హీరోయిన్ గా గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది కృతి శెట్టి. అమ్మడికి అదృష్టం కూడా కాస్త ఎక్కువే. ఎందుకంటే ముందుగా ఈ సినిమా కోసం ఎంపిక చేసిన హీరోయిన్ ని తప్పించి మరీ.. మేకర్స్ చివరి నిమిషంలో ఈ కన్నడ బ్యూటీని ప్రాజెక్ట్ లోకి తీసుకొచ్చారు.ఉప్పెనలో బేబమ్మగా నటించి తెలుగు ప్రేక్షకుల మన్ననలు అందుకుంది కృతి. తొలి సినిమానే యువ హృదయాలను కొల్లగొట్టి ఘన విజయం సాధించడంతో.. వరుస అవకాశాలు అమ్మడి తలుపుతట్టాయి. ఈ క్రమంలో ఆమె నటించిన రెండు సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద సక్సెస్ అవడంతో క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది.'శ్యామ్ సింగరాయ్' చిత్రంతో నాని తో రొమాన్స్ చేసిన కృతి.. రెండో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఇందులో ఆమె పాత్రకు పెద్దగా ప్రాధాన్యత లేకపోయినా.. నేచురల్ స్టార్ తో ఓ రేంజ్ లో రొమాన్స్ చేయడంతో అందరి దృష్టిని ఆకర్షించగలిగింది.ఇదే క్రమంలో సంక్రాంతి సందర్భంగా వచ్చిన 'బంగార్రాజు' చిత్రంలో యువసామ్రాట్ అక్కినేని నాగచైతన్య కు జోడీగా నటించింది కృతి. అక్కినేని తండ్రీకొడుకులు కలిసి నటించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకోవడంతో.. అమ్మడి ఖాతాలోకి హ్యాట్రిక్ హిట్స్ చేరిపోయాయి.కృతి ప్రస్తుతం సుధీర్ బాబు సరసన 'ఆ అమ్మాయి గురించి చెప్పాలి' అనే సినిమా చేస్తోంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. నితిన్ తో కలిసి 'మాచర్ల నియోజకవర్గం' అనే సినిమాలలో కృతి హీరోయిన్ గా నటిస్తోంది. ఇది జూలై ఫస్ట్ వీక్ లో రిలీజ్ కానుంది.అలానే రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న 'ది వారియర్' అనే ద్విభాషా చిత్రంలో హీరోయిన్ గా నటిస్తోందీ కన్నడ బ్యూటీ. ఇది రామ్ తో పాటుగా కృతికి కూడా డెబ్యూ తమిళ్ మూవీ. 2022 జూలై 14న తెలుగు తమిళ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా విడుదల కాబోతోంది.అంటే కృతి శెట్టి ఈ ఏడాది మూడు సినిమాలతో పలకరించబోతోంది. అయితే ఉప్పెనలా దూసుకొచ్చిన ఈ బ్యూటీని.. మీడియం రేంజ్ హీరోలతో చేస్తున్న చిత్రాలు టాప్ లీగ్ లోకి తీసుకెళ్తాయో లేదో అనే సందేహాలు కలుగుతున్నాయి. ఈ విషయాన్ని గ్రహించి స్టార్ హీరోల సినిమాల కోసం ట్రై చేస్తోందని టాక్ వినిపిస్తోంది.మహేష్ బాబు – రామ్ చరణ్ – ఎన్టీఆర్ – అల్లు అర్జున్.. వంటి స్టార్ హీరోలతో సినిమాల కోసం ఇప్పటికే తన మేనేజర్ల ద్వారా ప్రయత్నాలు మొదలు పెట్టిందని అంటున్నారు. అయితే పెద్ద హీరోల సినిమాల్లో నటించాలంటే అదృష్టం ఒక్కటే సరిపోదనే విషయం అందరికీ తెలిసిందే.అగ్ర హీరోల సరసన నటించాలంటే గ్లామర్ తో పాటుగా ఆకట్టుకునే బ్యూటీ ఉండాలి.. లేదా అద్భుతమైన నటి అయినా అయ్యుండాలి. రెండూ కలబోసిన వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుంది.

# మే 20న విడుదల కానున్న శేఖర్





గరుడవేగ, కల్కి వంటి సినిమాలతో సరికొత్త దారిలో సాగడం మొదలుపెట్టారు రాజశేఖర్. ఈసారి వాటికంటే కొత్త తరహా స్జబెక్ట్ని సెలెక్ట్ చేసుకున్నారు. మూడేళ్ల క్రితం వచ్చిన మలయాళ మూవీ 'జోసెఫ్' రీమేక్లో నటిస్తున్నారు. 'శేఖర్' పేరుతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి జీవిత దర్శకత్వం వహిస్తున్నారు. బీరం సుధాకర్ రెడ్డి, బొగ్గరపు శ్రీనివాస్, శివాని, శివాత్మిక నిర్మిస్తున్నారు. మే 20న సినిమా విడుదల కానుంది. ఇప్పటికే ఓ సాంగ్ని, టీజర్ని రిలీజ్ చేశారు. నిన్న అడివి శేష్ ట్రైలర్ని లాంచ్ చేశాడు. తర్వాత మాట్లాడుతూ 'ప్రతి మగాడి విజయం వెనుక ఒక మహిళ ఉంటుందంటారు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. ప్రతి విషయంలో వాళ్లే ముందుంటున్నారు. జీవితగారే దీనికి ఉదాహరణ. రాజశేఖర్ గారి సినిమాలు చిన్నప్పట్నుంచీ చూస్తూ పెరిగాను. ఆయన నటించిన 'మగాడు' నా ఆల్టైమ్ ఫేవరేట్. 'శేఖర్' సినిమా పెద్ద సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాను' అన్నాడు శేష్. రాజశేఖర్ మాట్లాడుతూ 'సంక్రాంతికే రిలీజ్ చేసేయాలనుకున్నాం. వీలు కాలేదు. అప్పట్నుంచీ డేట్ దొరక్క ఇప్పుడు విడుదల చేస్తున్నాం. మాకు సంక్రాంతి మే 20నే వస్తుంది. మూవీ తప్పకుండా సక్సెస్ అవుతుందనే కాన్ఫిడెన్స్ ఉంది' అన్నారు. 'మంచి సినిమా చూడటానికి ప్రేక్షకులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. ఈ సినిమాకి వర్క్ చేసిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్' అని చెప్పారు జీవిత. మా ఫ్యామిలీ అంతా కలిసి చేసిన ఈ సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉందంది శివాని. శివాత్మిక, ఈషా రెబ్బా, పవన్ సాధినేని, ప్రసన్న కుమార్, ముత్యాల రామదాసు, అనూప్ రూబెన్స్, రవివర్మ కూడా పాల్గొన్నారు.

# ప్రభాస్ డేట్స్ కోసమే మారుతి వెయిటింగ్!

'రాధేశ్యామ్' భారీ ఫ్లాప్ ను రుచి చూసినా ఆ విషయాన్ని గురించి ప్రభాస్ పెద్దగా పట్టించుకోకుండా ఆ తరువాత సినిమా లను చేసుకుంటూ వెళుతున్నాడు. ఆల్రెడీ 'ఆది పురుష్' సినిమాను పూర్తి చేసిన ప్రభాస్ 'సలార్' సినిమా కూడా పూర్తి చేసే పనిలో ఉన్నాడు. 'ఆది పురుష్' రామాయణ కథా కావ్యానికి దృశ్యరూపం. ప్రభాస్ తన కెరియర్లో తొలిసారిగా చేసిన పౌరాణిక చిత్రం. అందువలన ఆయన సక్సెస్ గ్రాఫ్ ను మళ్లీ పరిగెత్తించే పవర్ ఈ సినిమాకి ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఇక 'సలార్' కూడా ఆయనకి పూర్వ వైభవాన్ని తెచ్చిపెట్టే స్థాయి ఉన్నదేనని మాస్ ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించిన ఈ సినిమా కూడా పాన్ ఐడియా స్థాయిలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక ఈ సినిమా షూటింగులో పాల్గొంటూనే .. మరో వైపున 'ప్రాజెక్టు ఐ' సినిమా షూటింగులోను ప్రభాస్ పాల్గొంటున్నాడు.నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా అత్యంత భారీ బడ్జెట్ తో వైజయంతీ మూవీస్ వారు నిర్మిస్తున్నారు. టైమ్ మిషన్ నేపథ్యంలో ఈ కథ నడుస్తుందని అంటున్నారు. సైంటిస్ట్ పాత్రలో అమితాబ్ కనిపించనుండగా ఆయన కూతురి పాత్రలో దీపిక అలరించనుంది. ఇది పాన్ వరల్డ్ మూవీ అని నాగ్ అశ్విన్ చెప్పడం అందరిలో మరింత ఆసక్తిని పెంచుతోంది.ఈ సినిమా తరువాత ప్రభాస్ .. మారుతి దర్శకత్వంలో ఒక సినిమా చేయనున్నట్టుగా వార్తలు వస్తున్నాయి. మారుతి కూడా ఈ విషయాన్ని ధృవీకరించాడు. ఈ సినిమాకి 'రాజా డీలక్స్' అనే టైటిల్ ను పరిశీలిస్తున్నట్టుగా వార్తలు వస్తున్నాయి.ఈ ప్రాజెక్టుకు సంబధించిన సన్నాహాలు జరుగుతూ ఉండగానే మారుతికి పితృవియోగం కలిగింది. అందువలన ఈ ప్రాజెక్టుకి సంబంధించిన పనిలో కాస్త స్లో అయ్యాయి. ఈ ప్రాజెక్టు ముందుకు వెళ్లడానికి ప్రభాస్ డేట్ల సమస్య ప్రధాన కారణంగా మారిందని అంటున్నారు.'సలార్' .. 'ప్రాజెక్ట్ ఐ' రెండూ కూడా పెద్ద ప్రాజెక్టులే. ఈ రెండు సినిమాల మధ్య ఓ మాదిరి బడ్జెట్ లో మారుతి సినిమా చేయాలని ప్రభాస్ అనుకున్నాడు. అయితే ఆ రెండు సినిమాల మధ్యలో ఈ సినిమా చేయాలంటే ప్రభాస్ పూర్తి క్లారిటీతో డేట్స్ ఇవ్వవలసి ఉంటుంది. ఇంతవరకూ అలాంటిదేమీ జరగలేదట. ప్రభాస్ డేట్స్ ఇచ్చిన తరువాతనే వాటిని బట్టి ఇతర ఆర్టిస్టులను ఎంపిక చేసి వారి డేట్లను తీసుకోవలసి ఉంటుంది. అలాగే టెక్నీషియన్లను రంగంలోకి దింపవలసి ఉంటుంది. అందువలన ప్రభాస్ డేట్లకి సంబంధించిన క్లారిటీ రాకపోవడమే అసలు సమస్య అంటున్నారు. ఈ కారణంగానే ఈ ప్రాజెక్టు లేట్ అవుతుందని చెబుతున్నారు.



# ఆ సల్మాన్ ఖాన్ ఎవరో తెలీదు కానీ.. రషీద్ ఖాన్ అయితే తెలుసు..!



ఇండియన్ ప్రీమియర్ లీగ్లో పంజాబ్ కింగ్స్ పేలవ ప్రదర్శన కొనసాగుతుంది. లీగ్ ప్రారంభమై 15 ఏళ్లు గడుస్తున్నా ఆ జట్టు ఇప్పటివరకు ఒక్క టైటిల్ కూడా సాధించలేదు. ఎందరో కెప్టెన్లు, ఆటగాళ్లు మారినా ఆ జట్టు తలరాత మాత్రం మారడం లేదు. ప్రస్తుత సీజన్ (2022)లో కూడా ఆ జట్టు ప్రదర్శన అంతంతమాత్రంగానే ఉంది. ఏదో అద్భుతం జరిగితే తప్ప మయాంక్ సేన ప్లే ఆఫ్స్ అర్హత సాధించలేని పరిస్థితి నెలకొంది. ఈ సీజన్లో పంజాబ్ ఇప్పటివరకు ఆడిన 11 మ్యాచ్ల్లో 5 విజయాలతో పాయింట్ల పట్టికలో 8వ స్థానంలో కొనసాగుతుంది. జట్టు నిండా ప్రపంచ స్థాయి ఆటగాళ్లు ఉన్నా.. పంజాబ్ కింగ్స్ స్థాయికి తగ్గ విజయాలు సాధించలేకపోతుంది. పంజాబ్ ప్లే ఆఫ్స్కు చేరాలంటే తదుపరి ఆడే మూడు మ్యాచ్ల్లో భారీ విజయాలు సాధించాల్సి ఉంది.ఇదిలా ఉంటే, ప్రస్తుత సీజన్లో కీలక దశ మ్యాచ్లు జరుగుతున్న వేళ పంజాబ్ కింగ్స్ యాజమాన్యం ఓ ఫన్నీ కార్యక్రమాన్ని నిర్వహించింది. డు ఇట్ లైక్ శశి పేరుతో సాగిన ఈ ప్రోగ్రాంలో పంజాబ్ కింగ్స్కు చెందిన విదేశీ ఆటగాళ్లు పాల్గొన్నారు. ఇందులో యాంకర్ శశి చెప్పే పాపులర్ హిందీ డైలాగ్లను పంజాబ్ కింగ్స్ విదేశీ ఆటగాళ్లు కెమెరా ముందు రిపీట్ చేశారు. ఇంగ్లండ్ ఆల్రౌండర్ బెన్నీ హోవెల్, ఆసీస్ పేసర్ నాథన్ ఇల్లీస్, విండీస్ ఆల్రౌండర్ ఓడియన్ స్మిత్లు శశి చెప్పిన డైలాగ్లను బాగానే అప్పజెప్పగా, సఫారీ పేసర్ కగిసో రబాడ మాత్రం డైలాగ్ చెప్పేముందు నవ్వులు పూయించాడు. యాంకర్ శశి రబాడని 'మీకు సల్మాన్ ఖాన్ తెలుసా..?' అని ప్రశ్నించగా అందుకు రబాడ ఫన్నీ రిప్లై ఇచ్చాడు. ఆ సల్మాన్ ఖాన్ ఎవరో నాకు తెలీదు కానీ.. రషీద్ ఖాన్ అయితే తెలుసంటూ చమత్కరించాడు. అయితే ఆతర్వాత రబాడ చాలా కష్టం మీద సల్లు భాయ్ పాపులర్ డైలాగ్ను 'ఏక్ బార్ మైనే జో కమిట్మెంట్ కర్దీ' (తెలుగులో మహేశ్ బాబు పోకిరి డైలాగ్.. ఒక్క సారి కమిట్ అయితే నా మాట నేనే వినను) ప్రేక్షకులకు వినిపించాడు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది. కాగా, 2020 సీజన్ పర్పుల్ క్యాప్ విన్నర్ అయిన రబాడాను ఈ సీజన్ వేలంలో పంజాబ్ కింగ్స్ రూ.9.25 కోట్లకు దక్కించుకుంది. ప్రస్తుత సీజన్లో 10 మ్యాచ్లు ఆడిన రబాడ 18 వికెట్లు తీసి మరోసారి పర్పుల్ క్యాప్ రేసులో నిలిచాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190